
PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 29.11.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 26 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com


# సీట్లు మాకు... సిగపట్లు మీకు!



- ఇరు ప్రాంతాల మధ్య శాశ్వత శత్రుత్వం
- నీళ్ళ కోసం భవిష్యత్‌లో యుద్ధపర్వం
- సమస్యలు పరిష్కరించకుండానే ముందుకుపోతున్న కేంద్రం

రాష్ట్ర విభజన విషయంలో కేంద్ర ప్రభుత్వం రౌడీపంచాయితీ వైపే మొగ్గు చూపుతుంది. ఇరు ప్రాంతాలకూ సమన్యాయం చేయాలన్న మర్యాదరామన్న విధానం వైపు అసలు కన్నెత్తి కూడా చూడడం లేదు. తాత్కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం ఇరుప్రాంతాల మధ్య శాశ్వతంగా తలెత్తబోయే సమస్యలపై అసలు దృష్టి కూడా సారించడం లేదు.

ఎవరు ఎటు పోతే మాకేం, ఎలా కొట్టుకు ఛస్తే మాకేం... మాకు కావాల్సిందల్లా సీట్లు. ఆ దిశగానే రాష్ట్ర విభజన చేస్తాం అన్నట్లుగా ఉంది కేంద్ర ప్రభుత్వ వైఖరి. రాష్ట్ర విభజన ద్వారా సీమాంధ్రను ఎండబెట్టి, తెలంగాణకు దోచిపెట్టి అక్కడి ఎంపీ సీట్లన్నింటిని కొల్లగొట్టడమే కాంగ్రెస్ అధిష్ఠానం లక్ష్యం. ఈ దిశగా తెలంగాణ వాళ్ళు ఏదడిగితే అది చేస్తూ, సీమాంధ్రవాళ్ళు ఏదడిగినా నో అంటున్నారు. అంటే ఇక్కడ తెలంగాణ వాదులను సంతృప్తిపరచడానికి కాంగ్రెస్ ఎంతకైనా తెగిస్తుంది. రేపు పార్లమెంటు శీతాకాల సమావేశాలలో తెలంగాణ బిల్లు పెట్టాలి. ఇందు కోసమే హడావిడిగా అడుగులు వేస్తుంది. ఇందుకోసం విలువలను, నిబంధనలను కూడా కాలరాస్తుంది. సంప్రదాయాలను విస్మరిస్తోంది. ఆర్టికల్ 371(డి)ని సవరించనిదే రాష్ట్ర విభజన కుదరదన్న కేంద్ర హోంశాఖ అటార్నీ జనరల్ వాహనవతి చేసిన సూచనను కూడా పక్కన పెట్టేసింది. రాజ్యాంగ సవరణ (మిగతా 10వ పేజీలో)



# జడిపిస్తున్న జగన్


## చాకచక్యంగా ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగడుతున్నాడు

రాష్ట్ర విభజన బిల్లుపై దేశవ్యాప్తంగా ప్రాంతీయపార్టీల మద్దతు కూడగట్టడానికి వైయస్సార్ కాంగ్రెస్ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి సత్ఫలితాలనిచ్చే దిశగా కొనసాగుతుంది. కేంద్రప్రభుత్వ ఏకపక్ష విభజన నిర్ణయాన్ని ఆయన ఇప్పటికే ఢిల్లీలో అన్ని జాతీయ పార్టీల నేతలను కలిసి వివరించారు.

పార్లమెంటుకు రాష్ట్ర విభజన బిల్లు వచ్చినప్పుడు జాతీయ పార్టీలకంటే కూడా బిల్లును అడ్డుకోవడానికి ప్రాంతీయపార్టీల మద్దతు కీలకమవుతుంది. రాష్ట్ర విభజన బిల్లుకు పార్లమెంట్‌లో కాంగ్రెస్, బీజేపీలు మద్దతు పలుకుతాయి. కాబట్టి ఆమోదం పొందేందుకు అవకాశముంది. అయితే మెజార్టీ ప్రాంతీయ పార్టీలు అభ్యంతరం పెడితే కొన్నిబిల్లులు పెండింగ్‌లో పడవచ్చు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్, బీజేపీలు అనుకూలంగానే ఉన్నా, సమాజ్‌వాది, ఆర్జేడీ వంటి పార్టీలు ఆ బిల్లును అడ్డుకోగలిగాయి. దీంతో ఎన్నో ఏళ్ళుగా మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంటు ఆమోదానికి నోచుకోక మూలన పడిఉంది. ఈరోజు మా రాష్ట్రానికి జరిగిన అన్యాయమే రేపు మీ రాష్ట్రానికి జరగదనే గ్యారంటీ ఏముందంటూ జగన్ ప్రధాన ప్రాంతీయపార్టీల నేతలందర్నీ కలుస్తున్నారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, బిజుజనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్, దళ్(యు) అధినేత శరద్‌యాదవ్, ఎన్‌సిపి అధినేత శరద్‌పవార్, శివసేన చీఫ్ ఉద్ధవ్‌థాక్రే... ఇలా అన్ని ప్రాంతీయపార్టీల నేతలను కలుస్తూ తెలంగాణ బిల్లుకు వ్యతిరేకంగా వారి మద్దతు కూడగడుతున్నాడు. రేపు పార్లమెంటులో ఈ ప్రాంతీయ పక్షాలన్నీ ఏకపక్ష విభజనపై కేంద్రాన్ని కడిగి ఆరేయనున్నాయి. జగన్ ప్రయత్నాలు ఫలిస్తే పార్లమెంటులో ప్రాంతీయపార్టీలే టి-బిల్లును అడ్డుకుంటాయి.



# ఏ పనీ లేకే...
# విభజన పని!



వరుస కుంభకోణాలు... 2జీ స్పెక్ట్రమ్, ఆదర్శ్‌హౌసింగ్, కామన్ వెల్త్ క్రీడలు, బొగ్గు కుంభకోణం... ఒకదాని వెంట ఒకటిగా వచ్చిన కుంభకోణాలతో యూపిఏ ప్రభుత్వ ప్రతిష్ఠ మసకబారింది. ప్రధాని మన్మోహన్ సింగ్ పరువు కూడా బొగ్గు కొట్టుకుపోయింది. ప్రభుత్వం పని చేస్తుంటేనే కదా ఈ కుంభకోణాలన్నీ జరిగేది అని యూపిఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆలోచించింది. తమ పార్టీ వారికి పనికిమాలిన పని ఒకటి అప్పగిస్తే అవినీతి కుంభకోణాల జోలికిపోకుండా ఉంటారని భావించింది. ది బెస్ట్ పనికిమాలిన పని అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించడమేనని గుర్తించింది. ఇంకేముంది ఆ దిశగా అడుగువేసింది. ఈ పనికిమాలిన పనిని కేంద్రంలోని యూపిఏ ప్రభుత్వానికే కాక దేశంలో, రాష్ట్రంలో అన్ని రాజకీయపక్షాలకు అంటగట్టి వాళ్ళు కూడా సొంత పనులు మానుకుని ఈ పనికిమాలిన పనిలోనే తలమునకలయ్యేలా చేసింది. ఈ పని చెరువు వ్యవహారం రాష్ట్ర విభజన. ఈ పనికిమాలిన పని పెట్టుకున్నాకే కేంద్రంలో కుంభకోణాలు తగ్గుముఖం పట్టాయి. ఇదంతా కల్పితమే కావచ్చు కాని... జరుగుతున్న వాస్తవం మాత్రం ఇదే!

(మిగతా 10వ పేజీలో)

నూతన ప్రారంభం : నవంబర్ 29, 2013

ప్రముఖ మానసిక వైద్యుల సంయుక్త ఆధ్వర్యంలో
అంతర్జాతీయ విలువలతో మానసిక వైద్యం

వాసు
మానసిక చికిత్సాలయము

నెల్లూరు జిల్లాలో మొట్టమొదటి మహిళా మానసిక వైద్యురాలు

బ్రాంచ్ 1 : వర్తకి సెంటర్, ఆర్.ఆర్.స్ట్రీట్ (డా॥ సి.భాస్కర్‌రావు పాత హాస్పటల్) నెల్లూరు - 1. ఫోన్ : 2326652
బ్రాంచ్ 2 : 24-2-1849, SRK స్కూల్ వెనుక వీధి, మాగుంట లేఅవుట్, నెల్లూరు - 3. ఫోన్ : 2326642

సౌకర్యములు :
- కన్సల్‌టేషన్ మరియు మందులు
- మ్యారేజ్ కౌన్సిలింగ్ మరియు సెక్స్ కౌన్సిలింగ్
- వివిధ రకముల సైకోథెరపీలు (CBT / CAT / DBT / Psychodynamic Psychotherapy / Family Therapy)
- బిహేవియరల్ థెరపి
- ఎలక్ట్రో కన్‌వల్సివ్ థెరపి (ECT)

మా ప్రత్యేకత : హోమ్ విజిట్ సౌకర్యం (సిటీ పరిధి వరకు మీ ఇంటి వద్దు డాక్టర్ చే కన్సల్‌టేషన్ మరియు చికిత్స ఇవ్వబడును)

హృదయపూర్వక ఆహ్వానంతో...
డా॥ సి. శ్రీనివాసరావు MBBS., MRCPsych (లండన్)
డా॥ టి. స్వాతి MBBS., MRCPsych (లండన్)

- న్యూరో సైకియాట్రిక్ సమస్యలు
- మద్యపానం, మత్తు మందు, మాదకద్రవ్యాలు, జూదం వంటి వ్యసనాలు
- మతిమరుపు
- బుద్ధిమాంద్యం(మెంటల్ రిటార్డేషన్)
- నిద్రలేమి
- ఆత్మహత్య ఆలోచనలు
- ఆందోళన, భయాలు, గుండెదడ
- అవసరానికి మించి కాళ్ళు, చేతులు అదే పనిగా కడగడం, దోర్లు చెక్ చేసుకోవడం
- ఏకాగ్రతలోపించడం, శ్రద్ధ లేకపోవడం
- పిల్లలలో మొండి ప్రవర్తన మరియు నడవడికకు సంబంధించిన ఇబ్బందులు
- భ్రమ, భ్రాంతి, పూనిక, గాలి మొ॥ సమస్యలకు సంప్రదించండి



**బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఇది ఈరోజు రాత్రికి చెన్నై ఒంగోలుల మధ్య తీరాన్ని దాటే అవకాశముంది... తుఫాన్ మూలంగా ప్రకాశం, నెల్లూరుజిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశముంది. వంద నుండి 120కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చు... టీవీల్లో ఓపక్క ఇదే న్యూస్‌ను పదేపదే చెబుతుంటారు. అదే సమయంలో తుఫాన్ తీరం దాటే అవకాశముందని చెప్పిన నెల్లూరుజిల్లాలో ఎండ అదరగొడుతుంటుంది. మన జిల్లాలో నెలకొన్న వాతావరణమిది.**

# మన తీరానికి రాని తుఫాన్‌లు

నవంబర్ నెల కూడా పోతుంది. డిసెంబర్‌నెలలో వర్షాలు కురవడం అరుదు. నవంబర్ నెలే మన జిల్లాలో వర్షాలు కురిసే సీజన్. బంగాళాఖాతంలో తుఫాన్‌లు పుడుతున్నాయి. తీరం దాటుతున్నాయి. ఎక్కడెక్కడో వర్షాలు పడుతున్నాయిగాని జిల్లాలో పూర్తిస్థాయి వానలు పడలేదు. ఎగువప్రాంతాల్లో కురిసిన వర్షాల వల్లనైతేనేమీ, శ్రీశైలం డ్యాం నుండి విడుదల చేసిన నీళ్ళ వల్లయితేనేమీ జిల్లాలోని సోమశిల, కండ్లేరు రెండు ప్రధాన రిజర్వాయర్‌లు నిండాయి. కాని జిల్లాలో చెరువులే నిండలేదు. కేవలం ఈ రెండు రిజర్వాయర్‌ల మీదే ఆధారపడి ఏడాది పొడవునా సాగునీటి, తాగునీటి అవసరాలు తీర్చుకోలేము. ఈ సీజన్‌లో జడి పట్టిందంటే చెరువులు అలుగులు పారాలి. పెన్నా ప్రవహించాలి, వాగులు వంకలు పారాలి. ఇలా చెరువులు నుండి వాగులు పారి, బావులు నిండితేనే భూగర్భజలాలు పెరుగుతాయి. ఏడాదంతా సాగు, తాగు నీళ్లకు ఇబ్బంది వుండదు. సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌ల నీళ్ళు ఏడాది పొడవునా అవసరాలు తీర్చలేవు. మార్చి నెల దాటిందంటే మళ్ళీ నీటి కష్టాలు తప్పవు.

కనీసం బంగాళాఖాతంలో తుఫాన్‌లు వచ్చినప్పుడు కూడా జిల్లాలో భారీవర్షాలు కురవడం లేదు. ఈ నెలలోనే పైలీన్, హెలెన్, లెహర్ తుఫాన్‌లు వచ్చాయి. మన జిల్లా కూడా కోస్తా తీరంలోనే వుంది. కాని ఈ తుఫాన్‌ల ప్రభావం అసలు మన జిల్లాపైనే లేకుండా పోయింది.

జిల్లాకు తుఫాన్‌ల తాకిడి తప్పిపోయినట్లుగా వుంది. 1990లో కావలి వద్ద తీరం దాటిందే మనకు చివరి తుఫాన్. పాతికేళ్లుగా ఇక్కడ ఏ తుఫాన్ తీరం దాటలేదు. మన తీరప్రాంతంలో సముద్ర గర్భంలో వచ్చిన మార్పుల వల్లే ఈ ప్రాంతంలో తుఫాన్‌లు తీరం దాటడం లేదని, ఇది జిల్లాకు కొంతవరకు మేలేనని నిపుణులు అంటున్నారు. కాకపోతే బాధపడాల్సింది ఇంతకుముందు తుఫాన్‌ల వల్లనన్నా జిల్లాలో వర్షాలు కురిసేవి. ఇప్పుడు అవి కూడా లేకుండా పోయాయని.



## వంటేరు... ఏ గూటికో?


**రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయి. జంపింగ్ జపాంగ్‌లు మొదలయ్యాయి. సీమాంధ్రలో వరకు కాంగ్రెస్‌పార్టీ నడి సముద్రంలో మునిగే నావలా ఉండడంతో ఆ పార్టీ నుండే జంపింగ్‌లు ఎక్కువయ్యాయి. కొందరు వైయస్సార్ కాంగ్రెస్‌లో దూరుతుంటే, మరికొందరు తెలుగుదేశంను ఆశ్రయిస్తున్నారు.**

మరి కావలి రాజకీయాలను ఒక ఊపుఊపిన మాజీఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి భవిష్యత్ నిర్ణయం ఏ విధంగా వుండబోతుందనేది ప్రశ్నగా మారింది. జిల్లా రాజకీయాలలో దీనిపై చర్చ జరుగుతుంది. ప్రస్తుతం ఆయన ఏ రాజకీయపార్టీలోనూ లేడు. తటస్థంగా వున్నాడు. ఆయన మొన్నటి నెల్లూరు లోక్‌సభ ఉప ఎన్నికల వరకు తెలుగుదేశంలోనే వుండినాడు. ఆ ఎన్నికలలో తెలుగుదేశం అభ్యర్థి ఆయనే. తన పార్టీవాళ్లే తనకు పనిచేయ లేదనే మనస్థాపంతో ఆయన పార్టీని వీడి బయటకొచ్చాడు.

తెలుగుదేశాన్ని వీడాడేకాని ఇంకా ఏ పార్టీలో చేరాలనేది నిర్ణయం తీసుకోలేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్‌లోకి పోవడమంత దండగమాలిన పని ఇంకొకటి వుండదు. ఎందుకంటే అక్కడున్న వాళ్లే ఇతర పార్టీలవైపు చూస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్‌లో చూస్తేనా సీట్లు ఆశించి అయితే ఇక్కడ చేరబల్లేదు. ఇప్పటికే అక్కడ హౌస్‌ఫుల్ బోర్డు పెట్టారు. ఇక మిగిలింది మాత్ర సంస్థ తెలుగుదేశంపార్టీయే. తిరిగి ఇందులో చేరడానికి ఆయన మనసు అంగీకరిస్తుందా? అన్నది ప్రశ్న. కావలి నియోజకవర్గంలో బలమైన వర్గం కలిగిన నాయకుడు వంటేరు. 1999 నుండి 2004 వరకు ఇక్కడ ఎమ్మెల్యేగా పనిచేసి ఎంతో మంచిపేరు తెచ్చుకున్నాడు. 2009ఎన్నికలలోనూ, ఇటీవల జరిగిన నెల్లూరు లోక్‌సభ ఉపఎన్నికలలోనూ తెలుగుదేశం అభ్యర్థిగా పోటీచేసి ఎంతో నష్టపోయాడు. పార్టీ కోసం పని చేయడమే తప్ప, పార్టీని ఎప్పుడూ స్వార్థానికి వాడుకోని వంటేరు మళ్ళీ సొంతగూటికే పోతాడో లేక ఈ దిక్కుమాలిన రాజకీయాలు నాకెందుకని దూరంగా ఉంటాడో చూద్దాం.

## కోవూరు 'దేశం'లో అభ్యర్థి అయోమయం





**జిల్లాలో చాలా నియోజకవర్గాల్లో తెలుగుదేశానికి గట్టి నాయకులు లేరు. కొత్తనేతలను అన్వేషించాల్సివస్తుంది. ఇతర పార్టీల నుండి వచ్చేవాళ్ళ కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. వస్తానన్న వాళ్ళ కోసం రెడ్‌కార్పెట్ పరవాల్సి వస్తుంది. కాంగ్రెస్ నుండి వచ్చేందుకు ఏ నాయకుడు సిగ్నల్ ఇచ్చినా అతని చుట్టూ తిరగాల్సి వస్తుంది.**

కాని కోవూరు నియోజకవర్గంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉండడం విశేషం. ఎందుకంటే కోవూరు తెలుగుదేశం అభ్యర్థిగా ఒకరికి ఆరుగురు నాయకులపేర్లు ప్రచారంలో వుండడం విశేషం. నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలుగుదేశంపార్టీలో వున్నంతకాలం ఇక్కడ రెండో నాయకుడి ఆలోచనే లేకుండా పోయింది. 1993 నుండి 2009 దాకా జరిగిన అన్ని అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆయనే తెలుగుదేశం అభ్యర్థి. 2009 ఎన్నికల తర్వాత ప్రసన్న పార్టీ మార్చడంతో కొంతకాలం ఇక్కడ తెలుగుదేశానికి నాయకత్వ కొరత ఏర్పడింది. ప్రసన్న పార్టీ మారతాడనే ఆలోచన చేయకపోవడంతో పార్టీ కూడా ఇక్కడ ప్రత్యామ్నాయ నాయకుడిపై దృష్టి పెట్టలేదు. ఆ మధ్య జరిగిన కోవూరు ఉప ఎన్నికలలోనూ పార్టీ తరపున పోటీ చేయడానికి స్థానికంగా గట్టి నాయకుడు లేకపోవడంతో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డే ఇక్కడనుండి పోటీచేయాల్సి వచ్చింది. అయితే ఇక్కడ పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేసే దిశలో ఒకరికి మించి ఎక్కువ మందికి టిక్కెట్లు ఆశ పెట్టడంతో అభ్యర్థి విషయమై పార్టీ కేడర్‌లోనే గందరగోళం నెలకొనివుంది. మొన్నటి ఉపఎన్నికల్లో పోటీచేసి ఉన్నాడు కాబట్టి రేపటి ఎన్నికల్లోనూ ఇక్కడనుండి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పోటీచేస్తేనే బాగుంటుందనే అభిప్రాయం సర్వత్రా నెలకొనివుంది. స్థానిక కేడర్ కూడా ఆయనవైపే మొగ్గుచూపుతుంది. మరోపక్క బుచ్చి మండలంకు చెందిన మాజీజడ్పీటీసీ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, కోవూరుకు చెందిన చేజర్ల వెంకటేశ్వర్లరెడ్డిలు ఉపఎన్నికలప్పటి నుండే టిక్కెట్ రేసులో వున్నారు. ఇటీవలకాలంలో కోవూరు 'దేశం' అభ్యర్థిగా పారిశ్రామికవేత్త పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి పేరు ప్రచారంలో ఎక్కువగా ఉంది. కోవూరు నియోజకవర్గంలో సొంతడబ్బులు ఖర్చుపెట్టుకుని పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నది కూడా ఆయనే!

ఓపక్క వీళ్లుండగా కోవూరు టిక్కెట్ నీకేనంటూ కాంగ్రెస్‌లో వుంటున్న వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డిని తెలుగుదేశంలో చేర్చుకున్నారు. ఈ సీటు ఇస్తారనే గ్యారంటీతోనే మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలుగుదేశంలో చేరాలనుకున్నాడు. అయితే పట్టాభి తెలుగుదేశంలో చేరడం, కోవూరు సీటుపై ఆయనకు గ్యారంటీ ఇచ్చారనే ప్రచారం జరుగుతుండడంతో తెలుగుదేశంలో చేరాలన్న తన నిర్ణయాన్ని పోలంరెడ్డి వాయిదా వేసుకున్నట్లు తెలుస్తుంది. సీటుపై స్పష్టత లభించాకే ఆయన జెండా మార్పు నిర్ణయం ఉండొచ్చు. మొత్తానికి జిల్లాలో ఏ నియోజకవర్గంలో లేని విధంగా కోవూరు తెలుగుదేశం అభ్యర్థి విషయంలోనే అయోమయం నెలకొనివుంది.





## ఆ రెండు మినహా... అన్నీ క్లియరైనట్లే!

**యుద్ధం ఎప్పుడు వస్తుందా అన్నది ముఖ్యం కాదు. ఎప్పుడు వచ్చినా ఎదుర్కోవడానికి సైనికులు సిద్ధంగా ఉన్నారా? లేదా? అన్నదే అసలు పాయింట్. ఈ విషయంలో నూటపాతికేళ్ల ముసలి కాంగ్రెస్, ముప్పైఏళ్ల యువ తెలుగుదేశంల కంటే రెండేళ్ల పసి వైయస్సార్ కాంగ్రెస్ ఎంతో స్పీడ్‌గా ఉంది.**

ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే అభ్యర్థులను వెదుక్కోవడానికి కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు నానా తంటాలు పడాలి. కాని వైయస్సార్ కాంగ్రెస్ పరిస్థితి అందుకు భిన్నంగా వుంది. జిల్లాలో ఒక లోక్‌సభ, 10అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులు ఖరారైనట్లుగానే తెలుస్తుంది. ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలే అభ్యర్థులు కావడం ఖాయమని తెలుస్తుంది. ఇటీవలవరకు సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి వైసిపిలో చేరితే అభ్యర్థుల ఎంపికలో కాస్త మార్పు ఉండొచ్చని ప్రచారం జరిగింది. అయితే ఆయన వైసిపిలోకి కాకుండా తెలుగుదేశంపార్టీలోకి వెళుతుండడంతో ఇక్కడ సమన్వయకర్తలకు రూట్ క్లియరైంది. నెల్లూరు లోక్‌సభ నుండి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కోవూరు నుండి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఉదయగిరి నుండి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, ఆత్మకూరు నుండి మేకపాటి గౌతంరెడ్డి, సర్వేపల్లి నుండి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు నగరం నుండి పి.అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు రూరల్ నుండి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వెంకటగిరి నుండి కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కావలి నుండి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలకు లైన్‌క్లియరయినట్లుగా సమాచారం. పార్టీ పరంగా నిర్వహించిన సర్వేలో కాకాణి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌లు మంచి పనితనం చూపారని తేలింది. పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంలో మిగిలిన వారికంటే కావలి సమన్వయకర్త ప్రతాప్‌కుమార్‌రెడ్డి కొంత వెనుకబడ్డా, కావలి నియోజకవర్గంలో అతనే బెటర్ కాగలడని తేల్చారు. దీంతో సమన్వయకర్తలు దాదాపు ఎన్నికల

(మిగతా 10వ పేజీలో)



## పడకేస్తున్న పారిశుద్ధ్యం

పాలకవర్గం లేకపోవడం, అదిలించి మెదిలించేవారు లేకపోవడంతో నగరపాలక సంస్థలో పారిశుద్ధ్యం పడకేస్తుంది. పారిశుద్ధ్యపనుల్లో చిత్తశుద్ధి లోపిస్తుంది. నెల్లూరు నగరపాలకసంస్థ పారిశుద్ధ్య సిబ్బంది తగిన సంఖ్యలో లేకపోవడం, ఉన్నవాళ్లు అంతంతమాత్రంగా పనిచేస్తుండడంతో నెల్లూరులో పరిస్థితి ఎక్కడ చెత్త అక్కడే అన్నట్లుగా వుంది. గతంలో కార్పొరేటర్లు ఉన్నప్పుడు ఎవరి డివిజన్‌లలో వాళ్ళు కనీసం సిబ్బందిపై ఒత్తిడితెచ్చయినా పారిశుద్ధ్య పనులను చేయించుకుంటుండేవాళ్ళు. కాని ఇప్పుడు అడిగేవాళ్ళు లేకపోవడంతో పారిశుద్ధ్యపనులు అంతంత మాత్రంగా జరుగుతున్నాయి.

నగరంలో పందులు, దోమలు, కుక్కల బెడద ఎక్కువగా వుంది. చెత్తకుండీలు నిండినా చెత్త ఎత్తరు. చాలా ప్రాంతాల్లో చెత్త కుండీలు లేక చెత్తను రోడ్లమీదే పోస్తున్నారు. నివాసప్రాంతాల మధ్యే చెత్తకుప్పలు పేరుకుపోతుండడంతో పందులు, కుక్కలు, దోమలు చేరుతున్నాయి. బలిసిన దోమల దెబ్బకు జనాలు హడలెత్తిపోతున్నారు. మాగుంట లేఅవుట్, బి.వి.నగర్, కొండాయపాలెం గేటు వంటి ప్రాంతాల్లోనే పందులను మందలుమందలుగా మేపుతున్నారు. కోతులయితే ఇష్టారాజ్యంగా ఇళ్ళల్లోకి జొరబడుతున్నాయి. పారిశుద్ధ్యం లోపించడం, దోమలు విజృంభించడంతో నగరంలో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. నగరపాలకసంస్థ ఉన్నతాధికారులు పారిశుద్ధ్యంపై ప్రధానంగా దృష్టి సారించాల్సిఉంది.

PDF Compressor Free Version



# నెల్లూరు అభివృద్ధికి కృషి చేస్తున్నాం


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యేలు వివేకా, ముంగమూరు

నెల్లూరు అభివృద్ధికి విశేషకృషి చేశామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అన్నారు. ఈ నెల 25న నెల్లూరు లంగర్‌ఖానాలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో నెల్లూరు రూరల్, నగర ఎమ్మెల్యేలు ఆనం, ముంగమూరు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేకా మాట్లాడుతూ గత నాలుగేళ్ళుగా లక్షాముప్పైవేల రేషన్‌కార్డులు మంజూరు చేసామని, అర్హులైన వారికి రేషన్‌కార్డులు ఇచ్చేందుకు ఈ ఏడాది 36వేల తెల్లకార్డులు మంజూరయ్యాయన్నారు. ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజాసమస్యలను నేరుగా విని, వెంటనే పరిష్కరించేందుకే ప్రభుత్వం రచ్చబండ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిందన్నారు.

# పోర్టుతో మారనున్న రూపురేఖలు


జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఆనం

దుగరాజపట్నంపోర్టుతో గూడూరు డివిజన్ రూపురేఖలే మారనున్నాయని రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 27వ తేదీన చిల్లకూరులో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దుగరాజపట్నం వద్ద 20వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఓడరేవు నిర్మాణం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్య మంత్రితో పలు దఫాలు చర్చించి ఈ పోర్టును మన జిల్లాకు తీసుకురావడం జరిగిందని, అలాగే తిరుపతి ఎంపి చింతా మోహన్ కూడా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మన జిల్లాకు పోర్టు వచ్చేలా చేయ గలిగారన్నారు. ఈ పోర్టు ద్వారా స్థాని కులకే ఎక్కువ ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామ న్నారు. ఈ మండలంలో 72మందికి పింఛన్‌లు, 1867 ఇందిరమ్మ ఇళ్లు, 1754 రేషన్‌కార్డులు మంజూరు చేయడం జరిగిందని మంత్రి వెల్లడించారు. మరో 6నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని, వైఎస్ పార్టీలు కూడా మీ ముందుకు రాబో తున్నాయని వాటికి మీరే బుద్ధిచెప్పాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపి చింతా మోహన్, గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు, కాంగ్రెస్ నాయకులు పనబాక కృష్ణయ్య, యరటపల్లి జానకి రామిరెడ్డి, సహకార బ్యాంకు మాజీఛైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, ఎన్.జగన్మో హన్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు "రత్నం" విద్యార్థి



రాష్ట్రస్థాయి అండర్-14 బేస్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు డాక్టర్ కిషోర్స్‌రత్నం డాక్టర్ సివిరామన్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు విద్యార్థి గణేష్ ఎంపికయ్యాడు. తాడేపల్లిగూడెంలో శుక్రవారం నుంచి జరగనున్న 59వ బేస్‌బాల్ అండర్-14స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి గణేష్ ఎంపికకావడం హర్షణీయమని విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. తమ విద్యాసంస్థల్లో విద్యతో పాటు క్రీడలకు తగిన ప్రాధాన్యాన్ని ఇచ్చి విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి అభినందన సభను నిర్వహించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, ప్రధానోపాధ్యాయురాలు సుప్రియారెడ్డి అడ్మినిస్ట్రేటర్ ప్రపూర్ణ, మేనేజర్ కమల్‌సింగ్, పిఇటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ డీఎస్పీగా రాంబాబు



నెల్లూరురూరల్ డీఎస్పీగా వాకా శ్రీరాంబాబును బదలీ చేసారు. ప్రస్తుతం ఆయన నెల్లూరులో సిబిసిఐడి డీఎస్పీగా పనిచేస్తున్నారు. స్పెషల్ బ్రాంచ్ సిఐగా పనిచేస్తూ కొన్నినెలల క్రితమే పదోన్నతి పొందిన రాంబాబును నెల్లూరులోనే సిఐడి డీఎస్పీగా నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్పీల బదిలీలు జరగడంతో సమర్థవంతుడైన అధికారిని నియమిం చాలనే ఉద్దేశ్యంతో రాంబాబును నెల్లూరు రూరల్ డీఎస్పీగా నియమించారు. గతంలో రాంబాబు నెల్లూరు రూరల్ ఎస్ఐగాను, సిఐగాను పనిచేసి ఉండడం విశేషం. ఇప్పుడు రూరల్ డీఎస్పీ లోటు కూడా తీరిపోయింది. జిల్లా పోలీసు శాఖలో పనిచేసి సమర్థవంతులైన పోలీసు ఆఫీసర్లుగా పేరు తెచ్చుకున్నవారిలో రాంబాబు ఒకరు.

ఇక కావలి డీఎస్పీగా మహేశ్వర రాజును నియమించారు. అలాగే ఆత్మ కూరు డీఎస్పీగా మాల్యాద్రిని బదిలీ చేసారు. ఈయన జిల్లాలోని పలు స్టేషన్ లలో ఎస్ఐగాను, సిఐగాను, ఏసిబి సిఐ గాను పనిచేసి ఉన్నారు. మరో సిబిసిఐడి డీఎస్పీ కృష్ణకిషోర్‌రెడ్డిని పుత్తూరు డీఎస్పీగా బదిలీ చేసారు.

# వీనుల విందుగా వీణ కచేరి


వీణ కచేరి నిర్వహిస్తున్న ఎస్పీ సతీమణి కామేశ్వరి

నెల్లూరు జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ సతీమణి పొపూరి వెంకట కామేశ్వరి వీణ కచేరి సంగీతాభిమానులను వీనుల విందుగా అలరించింది. ఇటీవల నెల్లూరు ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో కామేశ్వరి వీణావాద్యం గావిం చారు. వారం వారం కార్యక్రమంలో భాగంగా ఈ కచేరి జరిగింది. దర్బారు వర్ణంతో వీణా వాద్యాన్ని ప్రారంభించారు. హంసధ్వని రాగంలో అభీష్టవరద, పంతువరాళిలో నిన్నే నెరనమ్మినాను, ఖరహరప్రియ రాగంలో ఒకపరినోకపరి, విలహరిలో కనుగొంటిని, పురంజి రాగంలో రామచంద్రాయ జనక, రాజజ మంగళ కీర్తన తదితర కృతులను వీణతో సుమధురంగా పలికించి కళాభిమానుల, అతిథుల అభినందనలు అందుకున్నారు. మృదంగంపై అమ్ముల ప్రసాద్ సహకారం అందించారు. వీణ అధ్యాపకుడు మాధేశ్వర కుమార్ పర్యవేక్షణలో కామేశ్వరి వీణ కచేరి జరిగింది.

ఈ కార్యక్రమంలో సంగీత పాఠశాల ప్రిన్సిపల్ సి.మునికుమార్, రాజు, పినాకపాణి, లోకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజా వాకర్స్‌కు ఉత్తమ అవార్డులు


రామిరెడ్డిని సత్కరిస్తున్న వాకర్స్

నెల్లూరు పొదలకూరురోడ్డు లోని జిల్లా ప్రజావాకర్స్ సంఘం ఇటీవల గుంటూరులోని వాకర్స్ ఇంటర్నేషనల్ (203డిస్ట్రిక్ట్) వారిచే ఉత్తమ సంఘంగా ఎంపి కయి ఐదు అవార్డులు సాధిం చింది. ఈ సందర్భంగా ఈనెల 28న పొదలకూరురోడ్డులోని హైస్కూలు ఆవరణలో సంస్థ గౌరవాధ్యక్షులు తుంగా నారాయణరెడ్డి, ఉత్తమ అధ్యక్షులుగా నిలిచిన చలంచర్ల భాస్కర్‌రెడ్డి, ఉత్తమ కార్యదర్శులుగా నిలిచిన మండవ శ్రీనివాసరావు, జె.ఎస్.ఆర్.ఆంజనేయులు వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ ప్రత్యేక అభినందనలు అందుకున్న బీరుదవోలు రామిరెడ్డిలను అభినందించి గౌరవపూర్వకంగా సత్కరించారు.

కార్యక్రమంలో సావిత్రమ్మ, వి.ఎస్.ప్రసాద్, వాసుదేవయ్య, సుబ్బరాయుడు, అనంతరావు, శ్రీధర్, యం.వి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి మాగుంట సేవలు ఎనలేనివి


దుప్పట్లు, పండ్లు పంపిణీ చేస్తున్న చెంచలబాబుయాదవ్

విద్యాభివృద్ధికి దివంగత మాగుంట సుబ్బారామిరెడ్డి ఎన లేని సేవలు అందించారని, ప్రజల హృదయాల్లో ఆయన చిరస్మరణీయుడిగా నిలిచిపోయా రని పిసిసి అధికార ప్రతినిధి సి.హెచ్.చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. మాగుంట సుబ్బా రామిరెడ్డి 66వ జయంతి సందర్భంగా నెల్లూరు పొదలకూరు రోడ్డులోని వికలాంగుల బాలికల వసతి గృహంలో చెంచలబాబుయాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ప్రమిద శ్రీనివాసులు, బివిఎన్.రాజు, కృష్ణయాదవ్, దుగ్గిరెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు బాంధవుడు ఎన్టీఆర్


మాట్లాడుతున్న కన్నబాబు

నెల్లూరుజిల్లా రైతులకు వరప్రసాదిని లాంటి సోమశిల ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు రైతు బాంధ వుడు, రైతుల ఆశాజ్యోతి అని ఆత్మకూరు తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి గూటూరు కన్నబాబు అన్నారు.

సోమశిల జలాశయం సాగునీటి వ్యవస్థను ఎన్టీఆర్ జాతికి అంకితం చేసి 25ఏళ్ళు పూర్తయిన సందర్భంగా తెలుగు దేశం నాయకులు రజతోత్సవ వేడుకల పేరుతో సోమశిలలోని ఎన్టీఆర్ పైలాన్ వద్ద మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రాపూరు సుందరరామిరెడ్డి మాట్లాడుతూ 1975లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభించిన జలాశయం 1986లో అర్థాంతరంగా ఆగిందన్నారు. ఎన్టీఆర్ ప్రత్యేక కృషివల్ల రెండేళ్ళలో సోమశిల నిర్మాణాలు పూర్తి దశకు చేరుకున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ కృషితో నేడు జిల్లా రైతులకు సోమశిల ద్వారా సాగునీటి సేవలందుతున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో సద్దా రవీంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మీనరసయ్య, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు, సూరారెడ్డి, చంద్రయ్యనాయుడు, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

హృదయపూర్వక కృతజ్ఞతలు

మోడరన్ స్కిన్ & కాస్మటాలజి క్లినిక్

నూతన భవన ప్రారంభోత్సవానికి విచ్చేసిన గౌరవనీయ అతిథులకు హృదయపూర్వక కృతజ్ఞతలు.

- శ్రీ ఆనం వివేకానందరెడ్డి గారు, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు
- శ్రీ ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి గారు, నెల్లూరు సిటీ శాసనసభ్యులు
- ప్రొ॥ డా. జి.రఘురామారావు, M.D. డెర్మటాలజీ ప్రొఫెసర్, విశాఖపట్నం
- శ్రీమతి నందిమండలం భానుశ్రీ, నెల్లూరు కార్పొరేషన్ మాజీ మేయర్

గార్లకు ప్రత్యేక ధన్యవాదాలు.



డా. పర్వతరెడ్డి పెంచలరెడ్డి, M.D.
స్కిన్ & హెయిర్ స్పెషలిస్ట్

ప్రత్యేకతలు
- అవాంఛిత రోమములను తొలగించుటకు డయోడ్‌లేజర్
- బొల్లి మరియు సోరియాసిస్ వ్యాధులను నయంచేయుటకు ఫోటోథెరపి
- పులిపిర్లు తొలగించుటకు కాన్‌మెడ్ హైఫ్రికేటర్
- ముఖంమీద వచ్చే మొటిమలను, మచ్చలను తొలగించుటకు కెమికల్ పీలింగ్
- ACNESCARS తగ్గించుటకు మైక్రో డెర్మాబ్రాషన్
- Hair Analysis
- Hair Fall Control Treatment

సాయిబాబా మందిరం ప్రక్కన, సండే మార్కెట్ దగ్గర, గాంధీనగర్, నెల్లూరు-1. ✆ 0861-2320628

PDF Compressor Free Version






## గ్రంథాలయాధికారిని నియమించండి

విజ్ఞానానికి సోపానాలైన గ్రంథాలయాలు నేడు దుర్భిక్షంలో ఉండటం శోచనీయం. కావలి పట్టణం నందుగల జిల్లా శాఖ గ్రంథాలయం పాఠకులకు ఉపయోగపడటం లేదు. గ్రంథాలయాధికారి లేకపోవడంతో అరకొర సిబ్బందితో గ్రంథాలయం నడిపించడం నిజంగా కావలి పట్టణవాసుల దురదృష్టం. ఎన్నో యేళ్ళుగా అర్హతలు కలిగిన ఉన్నతశ్రేణి గ్రంథపాలకులు లేకపోవడంతో వేలాది పుస్తకాలు సరైన క్రమంలో లేక నిరుపయోగంగా ఉన్నవి. ఉన్న సిబ్బందికి సరైన అవకాశం లేకపోవడంతో ఉన్నతమైన విద్యావంతులకు ఉద్యోగులకు మరియు నిరుద్యోగులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది.

ఆర్.దయాకర్‌రెడ్డి,
టి.మురళీమోహన్, కావలి.

## వారి గతీ అంతే!

బీజేపీ మోడీని ప్రచారసారథిగా, తర్వాత ప్రధాని అభ్యర్థిగా ప్రకటించగానే మోడీకి అభినందనలు తెలిపారు కుమ్మక్కు ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తే వారి కూటమిలో చేరి భీబీఐ దర్యాప్తుల బారి నుండి తప్పించుకోవాలనే ఉద్దేశ్యం ఆయనది. మోడీ వద్ద ఆ పప్పులుడకవు. ఎన్టీఆర్ ఆశయాలకు అనుగుణంగా నడుచుకునే తెలుగుదేశం నాయకుడిని ప్రోత్సహిస్తాడే కానీ చంద్రబాబును దగ్గరకు రానీయడు. కుమ్మక్కు రాజకీయాలు చేయకుండా ఉంటేనే బాబుకు భవిష్యత్తు. లేకుంటే యావజ్జీవ ప్రతిపక్ష నేతే! చంద్రబాబును కాపాడితే బీజేపీకి కూడా కాంగ్రెస్ గతే!

కురుగూరు రంగనాథం,
నెల్లూరు.

## ద్రోహులుగా మిగలొద్దు

కాంగ్రెస్ అధిష్టానం సీమాంధ్ర పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుంది. రాజకీయ కోణంలో విభజనకు పోతూ సీమాంధ్రకు తీరని ద్రోహం చేయాలని చూస్తుంది. కేంద్ర ప్రభుత్వాన్ని శాసించగల సంఖ్యా బలం వుండి కూడా మన ఎంపీలు చచ్చుదద్దమ్మలుగా మిగిలిపోవడం విచారకరం.

జి.సతీష్‌రెడ్డి, గరిమెనపెంట.

## 'ప్రభా'తం

### ప్రయత్నాలతోనే ఫలితాలు



**సున్నితమైన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఉత్తమమైన మార్గం. పూర్వకాలంలో ప్రతి గ్రామంలో పెద్ద మనుషుల పంచాయితీ ఉండేది. ఏ సమస్యపైనైనా ఇరు వర్గాల మధ్య రాజీకుదుర్చి పరిస్థితులను చక్కదిద్దేవాళ్ళు. నేటికాలంలో లోక్ అదాలత్‌ను పెద్దమనుషుల పంచాయితీగానే పరిగణించవచ్చు.**

సమాజంలో ఎప్పటికప్పుడు మార్పులు వస్తున్నాయి. మార్పులతో పాటూ మనమూ పరుగెత్తాలి. సాంప్రదాయ నిర్లక్ష్యాన్ని పక్కనపెట్టి నూతన విధానాలవైపు దృష్టి సారించాలి. కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టాలి. సమస్యలను చూసి బెదిరిపోవడం కాదు. సమస్యను చిన్నదిగా చేసి ఆ సమస్య నుండి సమాజాన్ని బయటపడేయాలి. ఏ సమస్య పరిష్కారానికైనా ప్రయత్నం అనేది ఒకటి ఉండాలి. భూమ్మీద ఆదిమానవుని కాలం నుండి నేటి ఆధునిక మానవునికాలం వరకు సంభవించిన ప్రతిమార్పు కూడా ప్రయత్నం ద్వారా వచ్చిందే! ఒక ప్రయత్నం ద్వారా ఆదిమానవుడు అగ్గిని కనిపెడితే కాలక్రమంలో ఆధునిక మానవులు ఇతర గ్రహాలపై జీవాన్వేషణ పరిశోధనలు సాగిస్తున్నారు.

ఒక ప్రయత్నం ఎంతటి అద్భుత ఫలితాలు సాధిస్తుందో అనేందుకు ఓ పెద్ద ఉదాహరణ ఈ నెలలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్ ద్వారా దేశవ్యాప్తంగా 35లక్షలకు పైగా కేసులను పరిష్కరించడం. 39లక్షల కేసులను పరిష్కరించాలని సర్వోన్నత న్యాయస్థానం లక్ష్యంగా పెట్టుకున్నా 35లక్షల కేసులు పరిష్కారం కావడం న్యాయస్థానాలు తమ భారాన్ని కొంత వరకు దింపుకోవడమే అవుతుంది. హడావిడిగా చేసిన విచారణలు, పరిష్కారాలతో బాధితులకు ఎంతవరకు సంపూర్ణ న్యాయం జరుగుతుందన్న ప్రశ్న కూడా లేకపోలేదు. అయితే అన్ని కేసుల్లో కూడా బాధితులకు నూటికి నూరుశాతం న్యాయం జరుగుతుందనుకోవడం పొరపాటే! బాధితులకు కొంత స్వాంతన చేకూరేలా వారి కేసులకు పరిష్కారాలు చూపగలిగితే చాలు. దేశంలోని న్యాయస్థానాలపై ఓ సామెత వాడుకలో వుంది. ఇక్కడి కోర్టుల్లో కేసు విచారణ పూర్తయ్యి తీర్పు వచ్చాక శిక్ష పడ్డవాడు ఏడుస్తాడు, కేసు గెలిచినవాడూ ఏడుస్తాడట. దీనికి కారణం శిక్ష పడ్డవాడు శిక్ష పడిందే గాక ఫీజు క్రింద ఆస్తులు పోగొట్టుకుని ఉంటాడు. బాధితుడు కూడా నిందితుడి మూలంగా నష్టపోయిందే కాక 'లాయర్' ఫీజుల కోసం ఆర్థికంగా నష్టపోతాడు. అంటే కేసుల విచారణకు, తుది తీర్పు రావడానికి ఏళ్లకాలం గడుస్తుంది. ఈలోపు బాధితుడిలో నేరం జరిగినప్పటి ఆవేశం తగ్గిపోతుంది. కేసు విచారణ కోసం కోర్టుల చుట్టూ తిరిగే కంటే రాజీపడితే సరిపోతుందనే భావనకు బాధితులు వచ్చేస్తున్నారు. ఇలా రాజీ ధోరణికి వస్తుండ బట్టే తీవ్రనేరాలకు సంబంధించిన కేసుల్లో కూడా నిందితులు తప్పించుకోగలుగుతున్నారు. కోర్టుల్లో కేసుల కాలయాపన వల్లే నేరస్థులు సైతం శిక్ష పడుతుందన్న భయం లేకుండా యథేచ్ఛగా నేరాలకు పాల్పడగలుగుతున్నారు. దేశవ్యాప్తంగా 16వేల దిగువస్థాయి కోర్టులు, 21హైకోర్టులు, ఒక సుప్రీంకోర్టుల్లో మొత్తం మూడున్నరకోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో వున్నాయి. ప్రతిరోజూ పరిష్కారమవుతున్న కేసులు తక్కువగాను, నమోదవుతున్న కేసులు ఎక్కువగానూ వున్నాయి. ఇదే దామాషాలో కేసులు పెరుగుతూ పోతే 2040నాటికి పెండింగ్ కేసుల సంఖ్య 15కోట్లకు చేరవచ్చునని న్యాయనిపుణుల అంచనా! పెండింగ్ కేసులు ఎక్కువగా చెల్లని చెక్కులు, కుటుంబ వివాదాలు, విడాకులు, రోడ్డు ప్రమాదాలు వంటి బాపతే! హత్యలు, మానభంగాలు, దోపిడీలు వంటి క్రూరమైన నేరాల నుండి ఈ కేసులను వేరుచేసి విచారణలు వేగవంతం చేయాల్సి వుంది. ఈ సున్నితమైన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఉత్తమమైన మార్గం కూడా. పూర్వకాలంలో ప్రతి గ్రామంలో పెద్ద మనుషుల పంచాయితీ ఉండేది. ఏ సమస్యపైనైనా ఇరు వర్గాల మధ్య రాజీ కుదుర్చి పరిస్థితులను చక్కదిద్దే వాళ్ళు. నేటికాలంలో లోక్ అదాలత్‌ను పెద్దమనుషుల పంచాయితీగానే పరిగణించవచ్చు. మొన్నటి జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ఒక్క మన రాష్ట్రంలోనే లక్షా 13వేల కేసులు పరిష్కారమయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో 9లక్షల కేసులను పరిష్కరించారు. దేశ రాజధాని ఢిల్లీలో 66వేల కేసులను చక్కదిద్దగలిగారు. దేశంలో పెండింగ్ కేసుల పరిష్కారానికి అదనపు న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటినుండో ఉంది. అయితే జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణ ఆ సమస్యకు పరిష్కార వేదికగా మారింది. రెండేళ్ల పాటూ నిరంతరాయంగా జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహిస్తే పెండింగ్ కేసులను పూర్తిగా పరిష్కరించవచ్చనే నమ్మకం కలుగుతుంది. పరస్పర చర్చలు, మధ్యవర్తిత్వాలతో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించగల సాధనం జాతీయ లోక్‌అదాలత్. దీనిని కొనసాగించి బాధితులకు సత్వరన్యాయం చేకూర్చే దిశగా సర్వోన్నత న్యాయ పాలకులు చర్యలు చేపట్టాల్సి వుంది. తరచూ విమర్శలు పాలవుతున్న భారత న్యాయవ్యవస్థకు సరికొత్త దిశ, దశ నిర్దేశం చేయాలని జనవాణి కోరుతుంది.

## 'అంతర్'జాతీయం

- నేపాల్ అసెంబ్లీ ఎన్నికలలో సుశీల్‌కోయిరాలా నేతృత్వంలోని నేపాలీ కాంగ్రెస్ ఆధిక్యం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుంది. ప్రచండ నేతృత్వంలోని యూసిపిఎన్ మావోయిస్టు పార్టీ 25స్థానాలతో మూడో స్థానంలో నిలిచింది.
- విధాన నిర్ణయాలపై పోలీసులు సొంత నిర్ణయానికి వచ్చేయడం తగదని రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. అన్ని రాష్ట్రాల డీజీపిలు, ఐజిలతో రాష్ట్రపతిభవన్‌లో ఇటీవల మూడురోజుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి నిర్మూలన, ప్రజాభద్రతకు పోలీసులు శాయశక్తులా కృషి చేయాలన్నారు.
- లైంగిక వేధింపుల కేసులో తెహల్కా ఎడిటర్ తరుణ్‌తేజ్‌పాల్‌పై గోవా పోలీసులు కేసు నమోదు చేసారు. సహచర మహిళా విలేకరిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లుగా ఆయనపై ఆరోపణలున్నాయి.
- వివాదాస్పద జపాన్ దీవులపై చైనా యుద్ధవిమానాలు గస్తీ తిరగడం తాజాగా ఉద్రిక్తతలకు దారితీసింది. 'డియోయు'గా చైనీయులు, 'సింకాకున్'గా జపనీయులు పిలిచే ఈ దీవులపై ఏడాదిగా రెండుదేశాల మధ్య వివాదం జరుగుతుంది.
- అణ్వాస్త్రాలను మోసుకెళ్లగల ధనుష్ బాలిస్టిక్ క్షిపణిని ఈ నెల 23న ఒడిసా తీరానికి చేరువలో ఓ యుద్ధనౌక నుండి విజయవంతంగా ప్రయోగించారు. ద్రవ ఇంధనంతో పనిచేసే ఈ క్షిపణి 500 నుండి వెయ్యి కిలోల బరువున్న సంప్రదాయ, అణుపేలోడ్‌లను మోసుకెళ్లగలుగుతుంది. నేలమీద, సముద్రం మీదున్న లక్ష్యాలను ఛేధించగలుగుతుంది.
- దేశంలోనే అత్యంత పెద్ద పైలట్ శిక్షణ కేంద్రాన్ని ఈ నెల 23న నోయిడాలో ప్రారంభించారు. ఇండిగో విమానాల సంస్థ ఇంటర్ గ్లోబ్ ఎంటర్‌ప్రైజెస్, సిఏఇల సంయుక్త సహకారంతో ఈ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసారు.
- దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన 14ఏళ్ల ఆరుషి, పనిమనిషి హేమరాజ్ హత్యకేసులో ఆరుషి తల్లిదండ్రులే హంతకులని సిబిఐ కోర్టు పేర్కొంది. కేసులో రాజేష్ తల్వార్(49), నుపుర్ తల్వార్(48)లను దోషులుగా తేల్చారు. వీరికి యావజ్జీవ జైలు శిక్ష విధించారు. ఆరుషి తన ఇంట్లో పనిచేసే హేమరాజ్‌తో సన్నిహితంగా వున్నందుకే 2008 మే15న వారిద్దరిని హత్య చేసారని అభియోగాలు నమోదయ్యాయి.
- 2014ని అంతర్జాతీయ కుటుంబ వ్యవసాయ సంవత్సరంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. రైతులు ఆహారభద్రతను సాధించేందుకు ప్రపంచ పేదరికాన్ని తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకుంది.
- ఈవిఎంలలో కొత్తగా పెట్టిన 'నోటా' మీటకు అభ్యర్థులందరికన్నా ఓట్లు ఎక్కువ వచ్చినా మళ్ళీ ఎన్నికలు నిర్వహించడం కుదరదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'నోటా'కు ఎక్కువ ఓట్లు వస్తే మళ్ళీ ఎన్నికలు నిర్వహించాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- ఆంధ్రప్రదేశ్ విభజన సరిగా లేదు. - శరద్‌యాదవ్ వ్యాఖ్య.
వ్యాఖ్య :- *సరిగా చేస్తే అది కాంగ్రెస్ ప్రభుత్వమెందుకవుతుంది.*
వార్త :- తెలంగాణలో అసెంబ్లీ స్థానాలు పెంచాలి. - జీఓఎంను కోరనున్న టీ-నేతలు.
వ్యాఖ్య :- *రాజకీయ నిరుద్యోగ సమస్యను ఈ విధంగా తీర్చుకోవడానికా?*
వార్త :- పేదలకు కాంగ్రెస్ చేసిందేమీ లేదు. - మోడీ.
వ్యాఖ్య :- *వాళ్ళు ఎవరికీ చేసిందేమీ లేదులే!*
వార్త :- ఢిల్లీ పాలకులు ఉన్మాదుల్లా వ్యవహరిస్తున్నారు. - జేపీ.
వ్యాఖ్య :- *వీళ్లకంటే పాకిస్థాన్ ఉగ్రవాదులు నయమనిపిస్తున్నారు.*
వార్త :- ప్రాంతాలను విభజించాలే తప్ప ప్రజలను కాదు. - బీజేపీ నేత వెంకయ్య
వ్యాఖ్య :- *ప్రాంతాలను చీలిస్తే ఓట్లొస్తాయా?*
వార్త :- నాకు సెల్‌ఫోన్ వాడకం రాదు. - తమిళనాడు గవర్నర్ రోశయ్య
వ్యాఖ్య :- *అదృష్టవంతుడివి... అందుకే ప్రశాంతంగా ఉన్నావు.*
వార్త :- రాయలతెలంగాణ అంగీకారమేనా? - వివిధ పార్టీల ఎమ్మెల్యేలకు నిఘా విభాగాల ఫోన్లు.
వ్యాఖ్య :- *అందరికీ ఏమోగాని జేసీ దివాకర్‌రెడ్డికి అంగీకారమే!*
వార్త :- వెళ్లేవాళ్లు వెళ్లొచ్చు... ఇక్కడే ఉండి పార్టీని నాశనం చేయొద్దు. - బొత్స.
వ్యాఖ్య :- *పార్టీని నాశనం చేసే బాధ్యతలను మీ అధినేత్రే నెత్తికెత్తుకుంది కదా!*
వార్త :- ప్రధాని ఒత్తిడితో పదవిలో కొనసాగుతున్నా. - కేంద్రమంత్రి పళ్లంరాజు.
వ్యాఖ్య :- *ఆయనే సోనియా ఒత్తిడిమీద ప్రధాని పదవిలో కొనసాగుతున్నారు.*
వార్త :- పేదరికపు గోడలు బద్దలు కొట్టాలి. - రాహుల్.
వ్యాఖ్య :- *60 ఏళ్ల నుండి అదే పనిగా కొడుతున్నారుగా... ఇంకా పగల్లేదా?*
వార్త :- రోశయ్య పాలనే ఉత్తమం. - దేశం పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి.
వ్యాఖ్య :- *సొంతపార్టీవాళ్ళు కూడా ఆయనను ఇంత బాగా మెచ్చుకుని వుండరు.*
వార్త :- తెలంగాణ కావాలంటే యూటీ చేయాల్సిందే. - కేంద్రమంత్రి శీలం.
వ్యాఖ్య :- *యూటీ చేస్తే లూటీ చేయొచ్చనుకుంటున్నారా?*
వార్త :- సీమను ముక్కలు చేయొద్దు. - సీపీఐ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి.
వ్యాఖ్య :- *ఆ నోటితోనే రాష్ట్రాన్ని ముక్కలు చేయొద్దని చెప్పొచ్చుగా!*

PDF Compressor Free Version



కరాటే క్రీడాకారులు

# జాతీయస్థాయిలో రాణించాలి

జాతీయస్థాయి కరాటే పోటీల్లో పాల్గొంటున్న కరాటే క్రీడాకారులను నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి అభినందించారు. మంగళవారం నెల్లూరు నవాబుపేటలోని ఎమ్మెల్యే స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో కొడవలూరు మండలం నార్తురాజుపాలెంలోని మాస్టర్ ఇంగ్లీషుమీడియం స్కూలు విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడారు. జాతీయస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం అష్‌టీడో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి కరాటే మాస్టర్ షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ ఒకినోవా కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో డిసెంబరు నెలలో జరగనున్న జాతీయస్థాయి ఓపెన్ కరాటే టోర్నీకి సంబంధించి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు.

కరాటే ఎంపికల్లో సృజన్, హనీఫ్, సుఫియాన్, అఖిల, సౌమ్య, శైలజ, రాజశేఖరగుప్తా, రేష్మా, తరుణ్, వంశీ, నర్సింహ, రోషిత్‌లు అర్హత సాధించారన్నారు. మాస్టర్ స్కూల్ కరస్పాండెంట్ ప్రభావతి డైరెక్టర్ చంద్ర, జనరల్ మేనేజర్ మహబ్‌షా, ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్‌లో పోలీసు కేసుల వివరాలు

పోలీస్‌స్టేషన్లో నమోదైన కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ఇకపై కేసుల వివరాలను సులువుగా తెలుసుకోవచ్చు. సీసీటీఎన్ఎస్ క్రైం క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం ద్వారా పోలీస్ ఉన్నతాధికారులు చురుగ్గా పని చేస్తున్నారు. ఎఫ్ఐఆర్ కాపీతో పాటు చార్జిషీట్ దాఖలు చేసే వరకు అన్ని వివరాలను ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. నెల్లూరు జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పదేళ్ళలోపు నమోదైన కేసుల వివరాలను పొందుపరుస్తారు. నెల్లూరు నగరంలోని ఒక్కో పోలీస్ స్టేషన్లో నాలుగు కంప్యూటర్లు, రెండు ప్రింటర్లు చొప్పున పంపిణీ చేసారు. ఆన్‌లైన్‌లో పేర్కొన్న వివరాలను సర్కిల్, డివిజన్, జిల్లా స్థాయి అధికారులతో పాటు రాష్ట్రస్థాయి అధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేస్తారు. ఇక సీసీటీఎన్ఎస్ ద్వారా నేరస్తులను పట్టుకోవడం సులభతరం అవుతుంది. నేరాలను అదుపులోకి తీసుకురావచ్చని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

# లాయర్ల రాస్తారోకో

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజనకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేస్తున్నందుకు నిరసనగా, సమైక్యాంధ్రకు మద్దతుగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లాయర్లు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. వెంటనే విభజన ప్రక్రియను నిలపాలని బార్ అసోసియేషన్ కార్యదర్శి ఇ.వి.రామిరెడ్డి ఆధ్వర్యంలో లాయర్లు విధులను బహిష్కరించి జిల్లా కోర్టు ఎదుట ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

# క్రికెట్ సిరీస్‌లో ఇండియా విజయం

## ముస్లిం యూత్ సంబరం



వెస్టిండీస్ పై ఇండియా క్రికెట్‌టీమ్ సిరీస్ గెలిచిన సందర్భంగా ఈనెల 27న నెల్లూరు జెండావీధిలోని "ముస్లిం యూత్" సంబరాలు చేసింది. యూత్ సభ్యులు ఎస్.కె.ఖాలిద్, ఎస్.కె.మీరా, మున్వర్, ఫజల్, రబ్బానీ, అల్తాఫ్ తమ సంతోషాన్ని ప్రకటిస్తూ కేక్ కట్‌చేసి పంపిణీ చేసారు. క్రికెట్ అభిమానులలో దాగి వుండే ఈ ఆనందం దేశభక్తిని తెలియజేస్తుంది.

ఇదే సంకల్పం అన్నింటా ప్రకటితమవుతూ దేశ ఔన్నత్యానికి దోహదపడితే ఎంతో సంతోషం.

# స్మగ్లర్లు.. వేషాలు వేస్తున్నారు

➤ గుంపుగా దొరికిన ఎర్రచందనం దొంగలు ➤ పెళ్ళి బృందంగా వెళుతూ పట్టుబడ్డారు

సినిమా స్టైల్లో పెళ్ళికి పోతున్న బృందంలా నటిస్తూ ఎర్రచందనం దుంగలను అక్రమంగా రవాణా చేస్తున్న దొంగల గుంపును అటవీశాఖ అధికారులు రట్టు చేసి దుంగల లారీని స్వాధీనం చేసుకుని 93 మందిని అరెస్టు చేసారు.




సూళ్ళూరుపేట ప్రాంతం నుంచి ఎర్రచందనం అక్రమంగా తరలి వెళుతుందని సమాచారం అందడంతో మంగళవారం సాయంత్రం అటవీశాఖ అధికారులు అలర్టయ్యారు. వెనువెంటనే తనిఖీలు మొదలుపెట్టారు. సూళ్ళూరుపేట సమీపంలోని సుగ్గుపల్లి చెరకు తోటల్లో నుంచి 25 ఎర్రచందనం దుంగలతో ఓలారీ వెళ్ళడాన్ని గమనించారు. తమిళనాడుకు చెందిన 93మంది కూలీలు పెళ్ళి వాళ్ళలా నటిస్తూ కూర్చున్నారు. సుగ్గుపల్లి నుంచి మంగానెల్లూరు, మావిళ్ళపాడు మీదుగా హైవే ఎక్కేందుకు ప్రయత్నించారు. అటవీశాఖ అధికారులు ఆ లారీని వెంబడించడంతో తల్లంపాడు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద దొరికిపోయారు.

లారీతో పాటు 25 దుంగలు స్వాధీనం చేసుకోవడంతో పాటు 93 మంది కూలీలను అరెస్టు చేసి వెంకటగిరి రేంజ్ కార్యాలయానికి తరలించారు.

# దేహదానంతో ధన్యుడయ్యాడు



తాను మరణించినా తన దేహంతో పదిమందికి ఉపయోగపడేలా చేశాడు ఓ మహనీయుడు. నెల్లూరులోని వనంతోపు ప్రాంతానికి చెందిన రిటైర్డ్ అటవీశాఖ అధికారి ముద్దపాటి రాఘవయ్య కాలేయవ్యాధితో ఈనెల 26న మరణించారు. మరణానికి ముందు ఆయన తన కళ్లు తన దేహం సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఆయన ఆశయానికి అనుగుణంగా వారి కుటుంబసభ్యులు వారి మరణంరోజే నేత్ర సమర్పణ చేశారు. అలాగే దేహాన్ని పినాకిని బాడీ డోనర్స్ ఆర్గనైజేషన్‌కు సమర్పించారు.

PDF Compressor Free Version



# నెల్లూరు కబుర్లు

## బదిలీల కసరత్తు

జిల్లాలో బదిలీల గోల మొదలైంది. ఇక ఎన్నికల సీజన్ రాబోతుంది. మధ్యలో మున్సిపల్, జడ్పీ ఎన్నికలు వస్తే ఇంకా తొందరగా బదిలీల జాతర మొదలవుతుంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలలోపు ఇక ఒకసారే బదిలీల ప్రక్రియ జరిగే అవకాశముంది. ఎన్నికల కోడ్ వచ్చిందంటే ముఖ్యంగా పోలీసు శాఖలో మూడేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న వారిని బదిలీ చేయడం ఖాయం. డిఎస్పీ, సి.ఐ స్థాయి అధికారుల బదిలీలు ముమ్మరంగా జరుగుతుంటాయి. జిల్లాలో ఇలా మూడేళ్లు పూర్తి చేసుకున్న అధికారులు తమకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీ చేసుకోవాలనుకుంటున్నారు. అలాగే అధికార ప్రజాప్రతినిధులు కూడా తమకు అనుకూలమైన అధికారులు నియమించుకునేందుకు పావులు కదుపుతున్నారు.

## పనబాక దిష్టిబొమ్మ దహనం

కేంద్రమంత్రి పనబాకలక్ష్మి దిష్టిబొమ్మను సోమవారం నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ కూడలిలో దహనం చేసారు. రాష్ట్ర విభజనకు సహకరిస్తున్న పనబాకలక్ష్మి వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని జేఏసి నాయకులు అంజయ్య డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వార్థం కోసం సీమాంధ్రుల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న పనబాకలక్ష్మి నెల్లూరు జిల్లా వాసి అని చెప్పుకునేందుకు సిగ్గుపడుతున్నామన్నారు. అనంతరం పొట్టిశ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం చేసారు.

ఈ కార్యక్రమంలో మధు, వెంకయ్య, చిరంజీవి, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 25వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో లెహర్ తుఫాన్‌పై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి.కె.మహంతితో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ పి.వి.యస్.రామకృష్ణ, జెసి బి.లక్ష్మీకాంతం, డిఆర్‌వో బి.రామిరెడ్డి

• ఎన్నాళ్లో వేచిన ఉదయం

## సిఐలకు త్వరలోనే పదోన్నతి!

పదోన్నతుల పరంపరలో తీవ్ర అన్యాయానికి గురైన సీసీఎస్ సిఐ పి.వీరాంజనేయరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ సిఐ వై.జయరామసుబ్బారెడ్డిలకు త్వరలోనే డిఎస్పీలుగా పదోన్నతి లభించనుంది. ఈమేరకు సుప్రీంకోర్టు నుండే లైన్ క్లియరైంది. 1989బ్యాచ్‌కు చెందిన వీళ్లు ఎప్పుడో డిఎస్పీల హోదాలో ఉండాల్సి వుండగా ఇంకా సిఐలుగానే ఉన్నారు. వీరి జూనియర్‌లకు కూడా గతంలోనే డిఎస్పీలుగా పదోన్నతులు వచ్చి ఉన్నాయి. రేంజ్‌లలో తేడా, రిజర్వేషన్లు వంటి కారణాలతో వీళ్ళు పదోన్నతుల్లో వెనుకబడ్డారు. తమకు జరుగుతున్న అన్యాయంపై ఈ బ్యాచ్ అధికారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు దీనిని సీరియస్‌గా పరిగణించి పదోన్నతులు కేటాయించడం మీకు చేతకాకుంటే మాకు అప్పగించండి... ఆ బాధ్యతలు మేం నెరవేరుస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి గట్టిగానే మొట్టికాయలు వేసింది.

## వైయస్సార్ పథకాలకు తూట్లు పొడిచారు



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కోటంరెడ్డి

వైయస్సార్ మరణంతో సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడిచిందని వైయస్సార్‌సిపి నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు ఆకుతోట హరిజనవాడలో సోమవారం క్రిస్మస్ మాసం ప్రారంభం సందర్భంగా పేనేటి సుధాకర్ ఆధ్వర్యంలో కోటంరెడ్డి మహిళలకు చీరలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచాయన్నారు. అనేక రాష్ట్రాల్లో వైయస్సార్‌ని ఆదర్శంగా తీసుకుని ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పంట్రంగి అజయ్, రమమ్మ, ఎం.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సైన్నియా-2013 ఫెస్టివల్



నెల్లూరులోని వేదాయపాళెం వెంకటరెడ్డినగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం హైస్కూల్‌లో ఈ నెల 23వ తేదీ విద్యార్థులకు సైన్నియా-2013 అనే పేరుతో వైజ్ఞానిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. సోలార్ ఎలక్ట్రిసిటీ, ఆటోమేటిక్ వాటర్‌లెవల్, లోపవర్ ఎమర్జన్సీ లైట్, హైడ్రాలిక్ బ్రిడ్జి, అర్కిమిడీస్ సూత్ర నిరూపణ సాంద్రతపై ప్రయోగాలు తదితరాలను ప్రదర్శనలో వుంచారు. ఈ కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల డైరక్టర్ డాక్టర్ కృష్ణకిషోర్, శ్రీమతి వాసంతి కిషోర్‌లు మాట్లాడుతూ ఇటువంటి శాస్త్రప్రదర్శనలతో విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతకు పదును పెట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రామమూర్తినాయుడు, సీనియర్‌మేనేజర్ రాజేష్, సి.ఇ.ఓ సంయుక్త, డి.సురేష్‌బాబు, ప్రిన్సిపాల్ జి.బాలాజీసింగ్, ప్రైమరీ ఇన్‌ఛార్జ్ శ్రీమతి అరుణ, ఎడ్ కామేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జైలులో డిఐజి

నెల్లూరు జిల్లా కేంద్ర కారాగారాన్ని రాయలసీమ జోన్ జైళ్ళశాఖ డిఐజి జయవర్ధన్ 23వ తేదీ తనిఖీ చేసారు. ఓపెన్ ఎయిర్ జైలు నిర్మాణ పనులు, ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిఐజి ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సబ్‌జైళ్ళ పర్యవేక్షణ కార్యాలయాన్ని పరిశీలించారు. డిఐజి వెంట జిల్లా కేంద్ర కారాగార సూపరింటెండెంట్ ఎంఆర్ చంద్రశేఖర్‌రావు, కళాసాగర్ జైలర్లు, సిబ్బంది ఉన్నారు.

### రాష్ట్ర కార్యదర్శులుగా

## జిల్లా తెదేపా నేతలు





కోవూరు నియోజకవర్గానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డిని గూడూరు నియోజకవర్గానికి చెందిన నేత చేవూరు విజయమోహన్ రెడ్డిని తెదేపా రాష్ట్ర కార్యదర్శులుగా తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు నియమించారు. దీనికి సంబంధించి ఈ నెల 23న జిల్లా పార్టీ కార్యాలయానికి ఆదేశాలందాయి. దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లోని తెదేపాలో సందడి నెలకొంది.

## వెలగని సెంట్రల్ లైటింగ్

నెల్లూరు నగరంలో తూర్పురైల్వే స్టేషన్ పరిధిలో ఏర్పాటుచేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ చూపుడుకే అన్నట్లుగా మారింది. లైట్లు వెలగక వాహనదారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ లైట్లలో ఒక్క లైటు వెలిగితే ఒట్టు. అధికారులు, అధికారపార్టీ నాయకులు ఈ రోడ్డు వెంబడి ప్రయాణిస్తున్నప్పుడు మాత్రం మిణుకు మిణుకు మంటూ వెలుగుతాయి. రైల్వేస్టేషన్‌కు దూరప్రాంతాల నుండి నగరం నుండి వచ్చేవారు చీకటిలో బిక్కు బిక్కుమంటూ వస్తున్నారు. ఇదే అదనుగా నేరగాళ్ళు హస్తలాఘవం ప్రదర్శిస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లైటింగ్ వ్యవస్థను మెరుగుపరచాల్సివుంది.

## నెంబరు ప్లేట్లపై పోలీసుల ఫీట్లు

మోటారు వాహనాల చట్టం ప్రకారమే వాహనాలకు నెంబరుప్లేట్లు వేయాలని నెల్లూరు జిల్లా ఎస్పీ పివియస్ రామకృష్ణ నగరంలోని స్టిక్కరింగ్ షాపుల నిర్వాహకులకు సూచించారు. సోమవారం నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో స్టిక్కరింగ్ కోసం వచ్చే వాహనాలకు నిబంధనల ప్రకారం నంబరు ప్లేట్లు వేయాలన్నారు. వాహన యజమానులకు ఇష్టం వచ్చినట్లు నెంబరు ప్లేట్లు వేస్తే స్టిక్కరింగ్ దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇంత చేసినా ఇదంతా మూణ్ణాళ్ళ ముచ్చటే, పదిరోజుల క్రింద ప్రెస్‌మీట్ పెట్టి పోలీసు, ప్రెస్ వాహనాలకు నాలుగు రోజుల్లో ప్రత్యేక స్టిక్కర్లు ఇస్తున్నట్లు ప్రకటించారు. కాని నేటి వరకు కార్యరూపం దాల్చలేదు. చూద్దాం ఈ యవ్వారం సరిగ్గా నిలుస్తుందో... లేదో....

## సింహపురి చిన్నారికి హైదరాబాద్‌లో సన్మానం



నెల్లూరు శివారు ప్రాంతం నవలాకులతోటలోని పాఠశాలలో చదివే విద్యార్థిని ఆర్.రమ్య(పదవ తరగతి)కు అరుదైన పురస్కారం లభించింది. ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో 97వ ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన "20సూత్రాల ప్రణాళిక సామాజిక అభివృద్ధి" అనే అంశంపై రాష్ట్రస్థాయిలో పాల్గొని 5వ స్థానాన్ని సాధించి రాష్ట్ర 20సూత్రాల పథకం ఛైర్మన్, ఎన్.తులసిరెడ్డి, రాష్ట్ర అధికార తెలుగుభాషా సంఘం ఛైర్మన్ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంది. రమ్య గతంలో మండల, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విద్యార్థినికి తర్ఫీదు, తోడ్పాటు అందించిన ఉపాధ్యాయుడు యం.సూర్యనారాయణను, రమ్యను, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ రమేష్‌బాబు అభినందించారు.

## "వాత్సల్య"కు రెయిన్‌బో చేయూత



నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని రెయిన్‌బో ఇంగ్లీషుమీడియం స్కూలు విద్యార్థులు "సామాజిక బాధ్యత విద్యార్థుల పాత్ర" కార్యక్రమంలో భాగంగా తాము తయారుచేసిన ప్రమిదలు కొవ్వొత్తులను అమ్మగా వచ్చిన మొత్తంతో అనాథ శరణాలయానికి ఈనెల 23న వంటపాత్రలు వితరణ చేసారు. కొండాయపాలెం రోడ్డులో వున్న జనహిత వాత్సల్య ఆశ్రయానికి వంటపాత్రలు అందించి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పద్మాసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు "లాయర్" హార్థిక అభినందనలు.

## వైభవంగా అయ్యప్పపూజలు



నెల్లూరు వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో ఈనెల 24న మండల పూజలు వైభవంగా జరిగాయి. ఉదయాన గణపతి హోమం, ఉషపూజ శ్రీవేలి ఉత్సవాలు, సాయంత్రం మహాదీపారాధన, భగవతిసేవ తదితర విశేషపూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తలుగా బట్టేపాటి శ్రీనివాసులురెడ్డి, స్నేహలతలు వ్యవహరించారు. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తులకు అన్నదానం చేసారు. విపిడి నంబూద్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి జి.శేషగిరిరావు, కె.వి.రత్నం, యం.విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version





ఈ నెల 26వ తేదీన చేజర్ల మండలం తూర్పుకంభంపాడులో 33కె.వి. సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన టి.గిరినాయుడు, ట్రాన్స్‌కో ఎస్ఇ నందకుమార్ తదితరులు

# మందు నిబంధనలు బంద్!



మద్యం వ్యాపారులు సిండికేట్‌గా చేరి మద్యం ధరలకు రెక్కలు తెస్తున్నారు. నిబంధనలు బేఖాతర్ చేసి ఇష్టారాజ్యంగా 24 గంటలు విక్రయాలు సాగిస్తున్నారు. ఎమ్మార్పీ ధరలకు ఏ ఒక్క మద్యం దుకాణదారులు విక్రయించడం లేదు. శివారు ప్రాంతాల్లోని దాబాల్లో, చిల్లరంగళ్లో కూడా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. నిర్ణీత సమయాల్లోనే మద్యం అమ్మాలని పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నా ఎక్సైజ్‌శాఖ మాత్రం మత్తులో జోగుతోంది. నెల్లూరు జిల్లాలో 348 మద్యం దుకాణాలు, 56 బార్లు ఉన్నాయి. నెల్లూరు నగరంలోనే ఎక్కువ సంఖ్యలో బార్లు ఉన్నాయి. మొదట్లో ఎక్సైజ్ అధికారులు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఎమ్మార్పీ నిబంధనలు ఉల్లంఘిస్తున్న పలు మద్యం షాపులను సీజ్ చేయడంతో అప్పట్లో కొద్దిరోజులు మాత్రమే ఎమ్మార్పీ ధరలకు మద్యం విక్రయాలు జరిగాయి. కమీషనర్ మారడంతో ధరలకు మళ్లీ రెక్కలొచ్చాయి. వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి ఇష్టారాజ్యంగా మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఎమ్మార్పీ ధరకంటే పది, పదిహేను రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం దుకాణాలు తెరవాలి. బార్‌లో విక్రయాలకు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు అనుమతి ఉంది. మద్యం దుకాణాల ముందు బహిరంగంగా తాగేందుకు అనుమతించ కూడదు. కాని మద్యం వ్యాపారులు ఈ నిబంధనలు గాలికి వదిలేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇక దాబాల విషయానికి కొస్తే గతంలో నేషనల్ హైవే ప్రక్కన మాత్రమే పరిమితమైన దాబాలుండేవి. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా వెలిశాయి. ఈ దాబాల్లో 24గంటలు మద్యం అందుబాటులో ఉంటుంది. ఇప్పటికైనా ఎక్సైజ్‌శాఖ అధికారులు కఠినంగా వ్యవహరించాల్సి ఉంది.

# అసెంబ్లీని ప్రోరోగ్ చేయాలి



అసెంబ్లీ నిరవధిక వాయిదా పడి ఐదు నెలలైనా అప్పటి వరకు ప్రోరోగ్ చేయకపోవడానికి కారణం రాష్ట్ర విభజన కుట్రలో భాగమేనని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. నెల్లూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈ నెల 23న విలేకర్లతో మాట్లాడారు. గతంలో నాదెండ్ల భాస్కరరావు ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిస్తే, సమైక్యాంధ్ర విషయంలో ఆయన కొడుకు నాదెండ్ల మనోహర్ రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారన్నారు. అసెంబ్లీ నిరధిక వాయిదా పడిన తర్వాత వారం రోజుల్లోగా ప్రోరోగ్ చేయాల్సివున్నా, ఇంతకాలం ఎందుకు ఊరుకున్నారన్నారు. స్పీకర్ సమాధానం చెప్పాలన్నారు. శాసనసభ్యుల్లో 294 మంది ఎమ్మెల్యేలకు విధివిధానాలు తెలియజేసే స్పీకర్ అసెంబ్లీని ప్రోరోగ్ చేసే విషయం తెలియదా అని ప్రశ్నించారు. విభజన సంప్రదాయం ప్రకారమే జరగాలని ఆయన డిమాండ్ చేసారు. రాష్ట్ర విభజనపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేయడంతోపాటు న్యాయస్థానాల్లో పోరాటం చేస్తామన్నారు.

# ఓట్లు, సీట్లే లక్ష్యంగా రాష్ట్ర విభజన



కార్యకర్తలు, అభిమానులతో అనిల్‌కుమార్

ఓట్లు, సీట్లే లక్ష్యంగా స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ విభజిస్తోందని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త పి.అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు నగరంలోని 12వ డివిజన్ ఏసీనగర్ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచ్చబండ కార్యక్రమాన్ని మహానేత వైయస్.రాజశేఖర్‌రెడ్డి ప్రవేశ పెట్టారన్నారు. వైయస్సార్ మరణానంతరం కాంగ్రెస్ ప్రభుత్వం మూడు రచ్చబండ కార్యక్రమాలను ఏర్పాటు చేసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి పరిష్కరించలేదని ఆరోపించారు. నెల్లూరు నగరంలో 25 వేల రేషన్ కార్డులను ఇచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు చెప్తున్నారని, బోగస్ ఏరివేత పేరుతో అసలైన అర్హుల కార్డులను తొలగించారని విమర్శించారు.

కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బాల కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆకలితో ఎవ్వరూ వుండకూడదు

**- మాగుంట పార్వతమ్మ**



కీర్తిశేషులు, పేదలపాలిట పెన్నిధి మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతి సందర్భంగా ఈనెల 23న కావలి పట్టణంలో ఆయన విగ్రహానికి ఆయన సతీమణి, మాజీ శాసనసభ్యులు మాగుంట పార్వతమ్మ పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుబ్బరామిరెడ్డి ప్రతిరోజూ ఆకలితో, ఆవేదనతో ఎవ్వరూ వుండకుండా, ఆనందంగా వుండేలా చూడాలని చెప్పేవారని పేర్కొన్నారు. సమాజంలో ఎవరికైనా పెట్టకపోయినా, పొట్ట కొట్ట కూడదని చెప్పేవారని అన్నారు. తాను తన మరిది శ్రీనివాసులురెడ్డి, సుబ్బరామిరెడ్డి ఆశయాల నిర్వహణ కోసమే రాజకీయాలలో కొనసాగుతున్నామన్నారు. సుబ్బరామిరెడ్డి మరణించి పదిహేడు సంవత్సరాలు అయినా ఇప్పటికీ నెల్లూరు, ప్రకాశంజిల్లాలోని ప్రజలు మరిచిపోకుండా తమ కుటుంబం పట్ల చూపుతున్న ఆదరణకు కృతజ్ఞులమని, వారిసేవ కోసం తమ శాయశక్తులా కృషిచేస్తామన్నారు. అతి తక్కువ కాలంలోనే సుబ్బరామిరెడ్డి అన్ని వర్గాల ప్రజల ఆదరణను పొందాడని, కాని విధి వక్రీకరించి భగవంతుడు ఆయనను దూరం చేసాడని ఆవేదన చెందారు.

# రచ్చబండ... కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్మకాండ

**- కాకాణి గోవర్ధన్‌రెడ్డి**



కాకాణికి స్వాగతం పలుకుతున్న మహిళలు

ఇంటింటికీ వైఎస్సార్సీపీ నినాదంతో వైఎస్సార్సీపీ సీఈసీ సభ్యులు, సర్వేపల్లి సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి తలపెట్టిన సమైక్యదీవెనయాత్ర ఈనెల 24న ముత్తుకూరు మండలంలోని పల్లూరు, రావి పాడు దళితవాడల్లో దిగ్విజయంగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రచ్చబండ కార్య క్రమం కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్మకాండగా మిగిలిపో తుందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ అప్ర మత్తంగా వుండి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్య మంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. జగన్ రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచేందుకు జాతీయ, ప్రాంతీయ పార్టీల మద్దతును కూడగడుతున్నారని, చంద్రబాబు రాష్ట్రవిభజనకు లేఖ ఇస్తే, సిఎం కిరణ్ సమైక్యమంటూ నాటకాలాడుతున్నాడన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, మండల నాయకులు కొడవలూరు రామిరెడ్డి, దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి, కందలూరు వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈనెల 23న ట్రాఫిక్ సమస్యపై అధికారుల సమావేశం జరిగింది. కార్పొరేషన్ కమీషనర్ డి.జాన్‌శ్యాంసన్, నగర డిఎస్పీ వెంకటనాథరెడ్డి, ఆర్అండ్‌బి డీఈ బాలిరెడ్డి, హైదరాబాద్‌లోని జెఎన్‌టియూ ప్రొఫెసర్ లక్ష్మణరావులు ఈ సమావేశంలో పాల్గొనగా ప్రొఫెసర్ లక్ష్మణరావు ట్రాఫిక్ నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు. ముఖ్యంగా నగరంలోని అన్ని కూడళ్ళలోని సిగ్నల్ లైట్లు సక్రమంగా పనిచేసే విధానం, జీబ్రా మార్కింగ్, యూటర్నింగ్‌లపై సమీక్ష జరిగింది. జాతీయ రహదారి నుంచి నగరంలోకి ప్రవేశించే 12 మార్గాల్లో ప్రమాదనివారణ, డివైడర్ల మధ్యనుంచి అడ్డదిడ్డంగా ప్రవేశిస్తున్న వాహనాలను నియంత్రించే చర్యలు గురించి ప్రస్తావించారు.

## కాలుష్యం కాటు...
# ప్రజలకు రోగాల పోటు!



నెల్లూరు నగరంలో నడిరోడ్డు పక్కన ఎవరైనా ఓ గంట నిలబడండి. గంట తర్వాత ముఖం మీద అంగుళం మందాన దుమ్ము పాండ్స్ పౌడర్ మాదిరిగా పేరుకుపోయి ఉంటుంది. నెల్లూరు నగరంలో కాలుష్యం అంతగా పెరిగిపోయింది. ఈ కాలుష్యం దెబ్బకు జనాలు రోగాలబారినపడి ఆసుపత్రుల పాలవ్వాల్సి వస్తుంది. నెల్లూరురోడ్ల మీద అయ్యప్పగుడి వద్ద నుండి బోసుబొమ్మ దాకా ట్రంకు రోడ్డులో ద్విచక్రవాహనాలపై ప్రయాణించామనుకోండి, ముందు వెళ్లే వాహనాల ధాటికి రోడ్ల మీద దుమ్ము మేఘాలు కట్టి మన ముక్కుల్లోకి, కళ్లలోకి, నోట్లోకి పోతుంటుంది. ఒక్క దుమ్మేనా అంటే సరిపెట్టుకోవచ్చు. నగరంలో తిరిగే టౌన్‌బస్సులు, ఇతరత్రా కాలం చెల్లిన వాహనాలు కాలుష్యపు భూతాలకు ఆనవాళ్ళుగా నిలుస్తుంటాయి. వాటి గొట్టాల్లో నుండి వచ్చే పొగను పీలిస్తే రకరకాల రోగాలు వస్తాయి. రిపేరుకు గురైన, సీజైన ఇంజన్‌లతోనే వాహనాలను నడుపుతుంటారు. ఇవి రోడ్ల మీద వదిలే పొగను చూస్తే దోమల నివారణకు నెల్లూరు నగరపాలక సంస్థ వాళ్ళు ఫాగింగ్ చేసినట్లుగానే ఉంటుంది. ఆ వాహనాలు అంతగా కాలుష్యం వెదజల్లుతుంటాయి. ఇంతకుముందు ఎక్కువగా తారురోడ్లు వుండేవి కాబట్టి ధుమ్ము పెద్దగా లేచేది కాదు. ఇప్పుడు నగరమంతా సిమెంట్‌రోడ్లయ్యాయి. వాహనాలు వెళ్ళినప్పుడు సిమెంట్ ధుమ్ములాగా లేస్తుంది. ఆరోగ్యానికి ఇది కూడా పెద్దప్రమాదకరం. ఈ కాలుష్యం వల్ల అలర్జీ, ఊపిరితిత్తుల వ్యాధులే కాదు, ప్రాణాంతక క్యాన్సర్ వంటి వ్యాధులు సైతం సంక్రమిస్తాయని వైద్యనిపు ణులు ఓపక్క హెచ్చరిస్తున్నారు.

సాధారణ ప్రజలు రోజుకో గంట రోడ్లమీద తిరిగితే దుమ్ము ధూళి దెబ్బకు హడలిపోతున్నారు. ఇక రోజూ 8గంటల నుండి 10గంటల పాటు నిలుచున్న చోటే ఉండి ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసుల మాటేమిటి. నగరంలో పెరిగిపోతున్న కాలుష్యానికి ముందుగా బలవుతున్నది వాళ్లే! ఎవరైనా ఆరోగ్యంగా ఉంటేనే కదా పని చేయగలిగేది! నగరంలో వీలైనంతగా సిమెంట్‌రోడ్లను తగ్గించడం, కాలం చెల్లిన వాహనా లను నియంత్రించడం, ఇంధనం అవసరం లేని సైకిళ్లు వంటి వాటిని ఎక్కువగా ఉపయోగించడం, చెట్లను పెంచడం, పార్కు లను అభివృద్ధి చేయడం, చీటికిమాటికీ చెట్లను కొట్టేయకుండా చూడడం వంటి వాటి ద్వారా ఈ కాలుష్యం కోరల నుండి కొంతవరకు బయటపడగలం.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము. ఆదివారం షాపు గలదు.

PDF Compressor Free Version



గల్పిక

# నెల్లూరు భక్తకన్నప్పకు శివయ్య దర్శనం

అది కైలాసం... కార్తీకమాసం. శివుడికి ఇష్టమైన మాసం. భూలోకంలో భక్తులు చేస్తున్న పూజలకు, శివనామస్మరణలకు పులకించిపోయిన భోళాశంకరుడు డివిడిలో 'మంజునాథ' సినిమా పాటలను పెట్టుకుని లయబద్ధంగా నాట్యం చేస్తుంటే పార్వతీదేవి, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామిలు పరవశించి చూస్తున్నారు. అంతలో ఓం నమశ్శివాయ... ఓం నమశ్శివాయ... అంటూ పెద్దగొంతుతో శివనామ స్మరణ వినిపించసాగింది. భక్తినాదంను ఆర్తనాదం మాదిరిగా చేస్తున్న ఆ ముదురుభక్తుదెవరబ్బా అని శివయ్య, పార్వతీదేవీలు అక్కడేవున్న ల్యాప్‌టాప్ తీసి గూగుల్‌సర్చ్‌లోకి వెళ్ళి అన్వేషించసాగారు. ఆ సెర్చ్‌లో వాళ్ళకు ఆ ఆర్తనాదాలు నెల్లూరులోని మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం నుండి వస్తున్నట్లుగా పసిగట్టారు. మరింతలోతుగా సెర్చ్‌లోకి వెళ్లారు. అక్కడ గర్భగుడి ముందు రెండుచేతులు జోడించి ఓంకారం చేస్తున్న స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(63) వీరికి కనిపించాడు. పార్వతీదేవి వుండి... ఆవు కోసం అల్లాడుతున్న లేగదూడలా... ఆ భక్తుడు చూడు స్వామీ... మీ దర్శనం కోసం ఎలా దీనంగా అర్థిస్తున్నాడో, ఒకసారి వెళ్ళి ఆ భక్తుడికి మీ దర్శనభాగ్యం కల్పించండి స్వామి అని కోరింది. దానికి శివుడు... దేవీ... ఎప్పుడంటే అప్పుడు మానవులకు దర్శనం కల్పించకూడదు. పదేపదే మనం కనిపించామంటే మనకు విలువ వుండదు. అలా కనిపించామంటే మన పరిస్థితి కూడా మెగాస్టార్ చిరంజీవిలాగా అవుతుంది. రాజకీయాల్లోకి రాకముందు అతనిని చూడ్డానికి జనం ఎగబడేవాళ్లు. కాని రాజకీయాల్లోకి వచ్చాక జనాన్ని చూడడానికి అతను ఎగబడాల్సివస్తుంది. కాబట్టి మనం చిరంజీవిలా ఇమేజ్ పోగొట్టుకోకుండా సోనియాగాంధీలా క్రేజ్ పెంచుకుని ఉండడమే మేలన్నాడు. అదెలా అని పార్వతీదేవి అడిగింది. అప్పుడు శివుడు... టెన్‌జనపథ్‌లో సోనియా గాంధీకి చించే పనులేమీ వుండవు. ఇంట్లో వంట పని, అంట్లుతోమేపనికి కొందరు ఎంపీలను పెట్టేసింది. ఇక కేంద్రంలో వున్న యూపిఏ ప్రభుత్వమే పని చేయడం లేదు. కాబట్టి ఆమెకేం పనివుండదు. సాక్షాత్తూ వాళ్ళ ప్రధాని కూడా ఖాళీగా వున్నాడు. వీళ్ళకేం పనిలేదు కాబట్టే ఈమధ్య ఆంధ్రప్రదేశ్ విభజన అనే ఒక పనిని పెట్టుకున్నారు. చేయడానికి ఏ పనీ లేనప్పుడు ఏదో ఒక పనికిమాలిన పని పెట్టుకుని పనిచేస్తున్నవాళ్లను చెడగొట్టడమే కాంగ్రెస్ పని. దీనినే వాళ్లు స్వయంఉపాధి పథకం అంటుంటారు. వాళ్లుచేసిన పాడు పనికి సీమాంధ్రలో ఉద్యోగులు చేస్తున్న పనులు మాని వీధుల వెంటపడితే, పిల్లోళ్లు చదువులుమాని ఇళ్ల వద్ద కూర్చున్నారు. ఇంత పని లేకుండా పనికిమాలిన పనులు చేస్తూ ఇంట్లో తీరిగ్గా కూర్చున్నా కూడా సోనియా గాంధీ అపాయింట్‌మెంట్ దొరకాలంటే నెలల కాలం పడుతుంది. కాంగ్రెస్ నాయకులు తిరుమల వెళితే వెంకయ్యను, శ్రీశైలం పోతే నన్ను పది నిముషాల్లో చూసేసి బయటకు రావాలనుకుంటారు. అదే సోనియాగాంధీ దర్శనం కోసమైతే నెలలతరబడి అయినా నిరీక్షించగలరు. ఆమె తొందరగా ఎవరికీ దర్శనం ఇవ్వదు కాబట్టే ఆమెకు అంత విలువ. కాబట్టి మనం కూడా మానవులకు అంత తొందరగా కనపడకూడదు. మన వ్యాల్యూ తగ్గిపోద్దని అన్నాడు. అందుకు పార్వతీదేవి... అన్నీ ఒకే కోణంలో చూడకూడదు స్వామి. ఆ భక్తుడిని చూడండి... అతనిని చూస్తుంటే సీమాంధ్రలోని 13జిల్లాల్లో అతనికిమించిన అమాయకుడు లేడనిపిస్తుంది. అతనిలో నాకు భక్తమార్కండేయ, భక్త కన్నప్ప, భక్త శిరియాల్‌లు కంబైన్డ్‌గా కనిపిస్తున్నారు. మీరు వెంటనే ఆ భక్తునికి దర్శనభాగ్యం కల్పించి అతని జన్మ సార్థకం చేయండి అని కోరింది. దానికి శివయ్య... నువ్వు చెపితే వినవు కదా... మనం లైవ్‌లో కనిపిస్తే వాళ్ల యాక్షన్, రియాక్షన్ ఎలా వుంటుందో ఇప్పుడే చూడు అంటూ శివయ్య అక్కడ మాయమై మూలస్థానేశ్వరస్వామి గుడిలో వివేకా ఎదుట ప్రత్యక్షమయ్యాడు. శివనామస్మరణ ముగించి వివేకా కళ్లు తెరిచాడు. ఎదురుగా త్రిశూలం మెడలో నాగరాజు ఒంటిమీద పులిచర్మంతో శివయ్య ఉన్నాడు. అతనిని చూసి వివేకా... ఎవరయ్యా నువ్వు... గర్భగుడికి అడ్డంగా నిలబడ్డావు. ఏ డ్రామాకంపెనీ నుండి వచ్చావు. బయట చిన్నపిల్లలుంటారు, అక్కడికెళ్లు. నిన్ను చూసి వాళ్లు సంబరపడతారు. ఎవరయ్యా ఈయన్ను లోపలకు రానించింది. ముందు బయటకు పంపండి అని అక్కడున్న ఇఓ జనార్ధన్‌రెడ్డికి చెప్పాడు. ఆ మాటకు శివుడికి మండి... మూర్ఖుడా... నన్ను బయటకు పంపమంటావా... నేనేరా అసలు శివుడిని అని అన్నాడు. అప్పుడు వివేకాకు మండి... మీరే శివుడు అని చెప్పడానికి ఐడీకార్డేమన్నా వుందా? ఆధార్‌కార్డు ఉందా? ఆధారాలు లేనిదే మేం నమ్మం. నీలాంటోళ్లను చాలామందిని చూసాంలేవయ్యా... నేను శివుడి వేషం వేసానంటే నీకంటే గ్లామర్‌గా ఉంటాను. ఇలాంటి వేషాలు నా వద్ద కాదు. అయినా నాలాంటి రాజకీయనాయకులకు కూడా ఆ శివుడు కనిపిస్తే ఆ శివుడికి మా సోనియాగాంధీకి పెద్ద తేడా ఏముందన్నాడు. ఆ మాటతో శివయ్య ఇక నోరెత్తలేదు. సరాసరి మళ్ళీ కైలాసానికి వచ్చాడు. జరిగిందంతా లైవ్‌లో చూస్తున్న పార్వతీదేవి... మీరన్నది నిజమేనండి... మనం ప్రత్యక్షంగా వీళ్లకు కనిపిస్తే మనల్ని అసలు లెక్కపెట్టరు. సోనియా పాలసీనే కరెక్ట్ అని అంది.

కదంబం

## రంగులెంత గొప్పవో!!

కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి,
కనిగిరి, 99487 74243

ప్రకృతి సౌందర్యాన్ని గుండెల్లో నాటుకొని
మొలకెత్తే అస్తిత్వపు వన్నెల్ని
దృశ్యమానం చేస్తూ
భావనా లోతుల్లోకి దృష్టిని లాక్కుపోయే
రంగులెంత గొప్పవి!

వస్తువు ఉపరితలానికి అందాలద్ది
ఆకర్షిస్తూ
అంతర్గత ఆలోచనలకు అద్దంపట్టే
రంగులెంత గొప్పవి!

చిత్రకారుని కుంచెలోంచి జాలువారి
కాన్వాస్ మీద పురుడోసుకున్న
సజీవ చిత్రాలచేత
ఎన్నో మౌనభాషలు మాట్లాడించే
రంగులెంత గొప్పవి!

కాలం కదిలిన దారిలో నుసైపోయిన గతాన్ని
వో పిక్టోరియల్ ఎఫెక్ట్‌తో
మనసును వర్తమానంలో రెపరెలాడించే
స్మృతులకు ఆలవాలమైన
రంగులెంత గొప్పవి!

వర్ణాల్లో వర్గాల్లో మనుషులు దాగున్నట్లుగాక,
రంగుల్లో వివిధ భావాలు వ్యక్తమౌతూ
మనోస్థలి మీద
తాబేలు నడకలా తారట్లాడే దుఃఖాన్ని అదిలించి
కురంగవేగంతో ఆనందానికి చోటిచ్చే
రంగులెంత గొప్పవి!

స్వార్థానికి స్వాస్థ్యం కూర్చేందుకు
జెండా రంగులు మార్చే
ఊసరవెల్లి రాజకీయ నాయకులకు
జనం చేతుల్లో ఎప్పటికైనా "రంగుపడద్ద"ని
హెచ్చరికకు అంగునిచ్చే
రంగులెంత గొప్పవి!!

## శివుని కార్తీకమాస స్వర, పదార్చన



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల విద్యార్థులు కార్తీకమాసం సందర్భంగా ప్రతి సోమవారం నెల్లూరులోని దర్గామిట్ట శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న కార్తీకమాస స్వర పదార్చన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సంగీత పాఠశాల గాత్ర విద్యార్థులు కె.నాగేంద్ర కుమార్, కె.శ్రావణ్‌కుమార్, కె.కృష్ణ కుమార్, కె.పెంచలనరసయ్యలు త్యాగరాజస్వామి కీర్తనలు అన్నమాచార్య కీర్తనలు గానంచేసి అందరిని ఆకట్టుకున్నారు. అనంతరం నృత్యపాఠశాల విద్యార్థినులు కుముద ప్రియ, ఆశ్రిత, దీప్తి సుమజ, కృష్ణ భార్గవి, హృతికాకృష్ణ, హర్షితాకృష్ణ భరతనాట్యం ప్రదర్శించి ఆహూతులను అలరించారు. వీరికి వయోలిన్‌పై యం.లోకేష్, కె.ఎస్.వేదవ్యాససాయ్, మృదంగంపై ఎ.శాంతి కళాధర్, గాత్రం జి.పినాకపాణి, నట్టువాంగం కె.తిరుపతమ్మలు సహకార మందించారు. వ్యాఖ్యాతగా పెరుగు సుజనారామం వ్యవహరించారు. ఈ కార్యక్రమాన్ని నృత్య పాఠశాల ప్రిన్సిపాల్ సి.మునికుమార్ పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా కార్తీక సోమవార పూజలు

కార్తీకమాసం పరమశివునికి ప్రీతికరం. కార్తీక మాసం నాల్గవ సోమవారం నగరంలోని శైవక్షేత్రాలన్నీ తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు నియమనిష్ఠలతో కార్తీకదీపాలను వెలిగించి నోములు నోచుకున్నారు. వేకువజాము నుంచే పరమేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేసారు. సాయంత్రం అన్ని శివాలయాల్లో పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కార్తీకదీపాలను వెలిగించారు. మూలాపేటలో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీస్వామివారికి ఆకాశ దీపాలంకరణ, నిత్యరుద్రహోమాలు, పాలాభిషేకం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలను ఆలయ ప్రధానార్చకులు నిర్వహించారు. రాత్రి ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది.

దర్గామిట్ట శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ సుందరేశ్వరస్వామి ఆలయం వద్ద మహిళలు కార్తీకదీపాలు వెలిగించి విశేష పూజలు నిర్వహించారు. వహాబ్‌పేట, నవాబుపేట, ఉస్మాన్‌సాహెబ్‌పేట, సంతపేట తదితర శైవక్షేత్రాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కార్తీకదీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.

## నరసింహకొండ హుండీ లెక్కింపు

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం నరసింహకొండపై నిలిచియున్న శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ లెక్కింపు ఈనెల 23న జరిగింది. అర్ధసంవత్సరం తర్వాత హుండీ లెక్కింపు జరిగిందని మొత్తం రూ॥ 5,32,379/-లు వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వేమిరెడ్డి పెదపెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోతన మహాకవి సాహిత్య సభ



సన్మానం అందుకుంటున్న డా॥ గిరిజాలక్ష్మి

నెల్లూరులోని రేబాల లక్ష్మీ నరసారెడ్డి స్మారకమందిరం క్రింది భాగంలో నెల్లూరు వర్ధమాన సమాజము మరియు పెళ్కూరు పట్టాభిరామిరెడ్డి స్మారక ధర్మనిధి, ఇస్కపాళెం సంయుక్త నిర్వహణలో మహాకవి పోతనామాత్యుల సాహిత్య సభ జరిగింది. "పోతన కవితావైభవం" అను అంశంపై నెల్లూరులోని వేద సంస్కృత కళాశాల రీడరు డా॥కె.గిరిజాలక్ష్మి ఉపన్యసించారు. సభా పోషకులు పెళ్కూరు సుధాకర్‌రెడ్డి తల్లి స్వర్గీయ పెళ్కూరు వజ్రావతమ్మ స్మృత్యర్థంగా జరిగిన ఈ సాహితీ సభలో ఉపన్యాసకులు డా॥గిరిజాలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్ధమాన సమాజం అధ్యక్షులు పంటేరు వెంకటకృష్ణారెడ్డి, కార్యదర్శి మజ్జిగ ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

## కల్యాణ వీరభద్ర ఆలయంలో అన్నదానం

గూడూరు పట్టణంలోని శ్రీ కల్యాణ వీరభద్ర ఆలయంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. వీరభద్ర ఆలయ అన్నదాన సమితి కన్వీనర్ రుమ్మారు మునిమోహన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా నిర్వహించే ఈ అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయభాస్కర్, కె.రాజగోపాల్, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

# బియ్యం నిల్వలపై విజిలెన్స్ దాడులు

నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేట రేబాలవారివీధిలో బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లైస్ అధికారులు 23వ తేదీ రాత్రి దాడులు చేపట్టారు. ముగ్గురు వ్యక్తులు ఎఫ్‌జీఎల్ లైసెన్స్ లేకుండా బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. మొత్తం 106 క్వింటాళ్ల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులపై 6ఏ కేసులు నమోదు చేసారు. ఆసందర్భంగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఓపి ధనుంజయరెడ్డి మాట్లాడుతూ బియ్యం వ్యాపారం చేసే ప్రతి ఒక్కరికి ఎఫ్‌జిఎల్ లైసెన్స్ ఉండాలన్నారు. రేబాలవారివీధిలోని ముగ్గురు వ్యాపారులు లైసెన్స్ లేకుండా బియ్యం అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. రూ. 2 లక్షల 30 వేల విలువ చేసే బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఈదాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్లు సంగమేశ్వర రావు, శ్రీనివాసరావు, డిసిటిఓ, రవికుమార్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డిప్యూటీ తహాశీల్దార్లు కాయల సతీష్‌కుమార్, డిఎస్ వెంకటేశ్వరరావు, ఓపీ రమణారావు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి ఎన్‌సిసిలో చేరాలి

ప్రతి విద్యార్థి ఎన్‌సిసిలో చేరి దేశ ప్రగతిలో పాలు పంచుకోవాలని 10(ఎ) నావల్ యూనిట్ ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్, కమాండర్ వివీయస్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సర్వోదయ కళాశాలలో 65వ నేషనల్ క్యాడెట్ కార్ప్స్(ఎన్‌సిసి) దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవ్ ఎనర్జీ ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా బిఎస్‌రావు మాట్లాడుతూ ఎన్‌సిసిలో చేరి సర్టిఫికెట్‌తో విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాయితీలను పొంది జీవితంలో ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యుత్ ఆదా, వినియోగం, తదితర విషయాలను వివరిస్తూ ఎన్‌సిసి క్యాడెట్లు ప్లకార్డులు ప్రదర్శించారు. సర్వోదయ కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ డాక్టర్ సివీసురేష్, విఆర్ కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎన్ ప్రభాకర్, ఎంసిపిఓ వినోద్‌కుమార్, కెవిసి జూనియర్ కళాశాల కేర్‌టేకర్ ధనుంజయ కుమార్, ఎన్‌సిసి క్యాడెట్లు 10(ఎ) నావల్ యూనిట్ ఎన్‌సిసి పిఐ సివిలియన్ స్టాఫ్ పాల్గొన్నారు.

# అత్యాచార వ్యతిరేక దినోత్సవం



నెల్లూరు ఆదిత్య నగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో సింహపురి సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 25న ప్రపంచ మహిళా అత్యాచార వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కవి సమ్మేళనం జరిగింది. సమాఖ్య ఉపాధ్యక్షులు సిరిమామిళ్ళ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో కార్యదర్శి గుర్రాల రమణయ్య నిర్వహణలో జరిగిన ఈ కవి సమ్మేళనంలో నెల్లూరు జిల్లాలోని వివిధ గ్రామాల నుండి పలువురు కవులు పాల్గొన్నారు.

స్త్రీలపై జరిగే అత్యాచారాలను అరికట్టడం గురించి ఆచార్య ఆదిత్య, జి.సుభద్రాదేవి, ఎస్.దయాకర్‌రెడ్డి, బి.వి. నరసింహం, సీతారామస్వామి, అమరా బాలగంగాధరరావు తదితరులు సూచనలను చేసారు.

## పల్లెల్లో కూడా...

# డంపింగ్ యార్డులు

ఇప్పటి వరకు మునిసిపల్ నగరపాలక సంస్థలు, పురపాలక సంస్థలకే పరిమితమైన చెత్త నిల్వల కేంద్రాలు (డంపింగ్‌యార్డులు) ఇక నుంచి పల్లెల్లో కూడా ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇందుకు సంబంధించి కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో చెత్త సమస్యలతో సతమతమవుతున్న గ్రామ సర్పంచ్‌లకు ఉపశమనం లభించినట్లైంది. వీటి ఏర్పాటుకు ఉపాధి పథకం కింద నిధులు కేటాయిస్తారు. ఏడాది పొడవునా కూలీలకు పనికల్పిస్తారు. నెల్లూరు జిల్లాలోని 927గ్రామపంచాయితీలతో పాటు వాటికి అనుసంధానంగా మరో 300 గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా డంపింగ్ యార్డులను ఏర్పాటుచేస్తే వేలాది మందికి ఏడాది పొడవునా ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. పంచాయితీలోని రెండుమూడు గ్రామాల్లో చెత్త తొలగింపుకు 10 నుంచి 20మందిని నియమించే అవకాశం వుంది. డంపింగ్‌యార్డులు ఏర్పాటు చేస్తే పంచాయితీలపై ఆర్థికభారం తగ్గే అవకాశం వుంది. గ్రామాలు శుభ్ర పడతాయి. ఈ వినూత్న కార్యక్రమానికి మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులను కేటాయిస్తారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల ఈ సమస్య చాలా వరకు కొలిక్కి వచ్చే అవకాశం వుంది.


# రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 29.11.2013 నుండి తేది. 05.12.2013 వరకు


## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఆదాయ లోపం ఉండదు. కాని అదనపు ఖర్చులు తప్పవు. ఉద్యోగార్థులకు అవకాశాలు ఆలస్యం, శుభకార్యాలలో పాల్గొనడం, పనులలో టెన్షన్ పడడం ఉంటుంది. ముఖ్య వ్యవహారాలందు ఇతరులపై ఆధారపడవద్దు. ఉద్యోగులు వ్యామోహాలకు లొంగకుండా విధి నిర్వహణలో జాగ్రత్త పడండి. షేర్లు పెట్టుబడి రంగాలలో ఆదాయం బాగుంటుంది.


## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వ్యాపారపరంగా అవకాశాలు చేజారవచ్చును. షేర్లు, స్టాక్‌మార్కెట్ రంగాలలో నిరాశ ఏర్పడుతుంది. ధన వ్యయం పెరిగిపోతుంది. చేపట్టిన పనులు సక్రమంగా జరగక పోవడం వల్ల ఆందోళన ఉంటుంది. అవసరాలకు ఏదో విధంగా సర్దుబాటు అవుతుంది. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. కోర్టు కేసులు వాయిదా పడవచ్చును.


## మిధునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి. తొందరపాటు వ్యవహారాల వల్ల తగాదాలు రావచ్చును. ఆస్తి వ్యవహారాలలోను, కోర్టు వ్యవహాలలో అనుకూలత ఉంటుంది. తీసికొనే మంచి నిర్ణయాలు భవిష్యత్తుకు ఉపయోగపడతాయి. వృత్తి వ్యాపారాలలో పెరుగుదల, రాబడి బాగుంటుంది. దూరప్రయాణాలు నిర్ణయం చేస్తారు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

అనుకున్న పనులు ఆటంకాలతో జరుగుతుంటాయి. ఉద్యోగార్థులకు అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. కళాక్రీడా, టెక్నికల్ రంగాలలో అవకాశాలు రాగలవు, క్రొత్త వ్యాపారాలు, క్రొత్తగా పెట్టుబడులు పెట్టే సాహసం పనికిరాదు. వృత్తి జీవనము కలవారికి ఆర్థికస్థితి ఆదాయం బాగుంటుంది. అనుకోని అవసరాలకు ఏదో రూపంలో డబ్బు సర్దుబాటు కాగలదు. స్థలాలు, గృహాలు, పొలాల వంటివి కొనుగోలులో జాగ్రత్తపడండి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. దేశ, విదేశ ప్రయాణాలు ఖరారుకాగలవు. చిన్న వృత్తులు, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. వ్యాపార వృద్ధి ప్రయత్నాలలో అనుకూలత, ఆదాయం పెరుగడం ఉంటుంది. కోర్టు వ్యవహారాలలో కొంత ఊరట లభిస్తుంది. రావలసిన బాకీలు కొంత మేరకు లభించడం, షేర్లు, పెట్టుబడులందు లాభాలుంటాయి.

## పంచాంగము


తేది 01 ఆదివారం ధన్వంతరి జయంతి

ఈ వారం మేషంలో కేతువు, మిధునంలో బుధుడు, కన్యలో కుజుడు, కన్య తుల వృశ్చిక ధను రాశులలో చంద్రుడు, తులలో శని రాహు బుధులు, 01 తేది నుండి వృశ్చికంలో బుధుడు, వృశ్చికములో రవి, ధనుస్సులో శుక్రుడు, 05 తేది నుండి మకరంలో శుక్రుడు సంచరిస్తారు.

## ముహూర్తములు

ముహూర్తములు లేవు

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తిపరంగా సామాన్య ఆదాయముంటుంది. హామీలివ్వడం, పెద్దమొత్తములలో పెట్టుబడులు పెట్టడం చేయవద్దు, వస్తు, వాహన రిపేర్ల ఖర్చులుంటాయి. వ్యాపార వర్గాలకు మంచి అవకాశాలు దొరకడం, ఆదాయం పెరగడం ఉంటుంది. స్టాక్ పెట్టుబడి రంగాలు స్వల్ప లాభాలతో సాగుతాయి. విద్యార్థులకు మంచి విద్యాప్రగతి ఉంటుంది. కుటుంబ సౌఖ్యముంటుంది.


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

దూరప్రయాణాలు, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. అనుకున్న పనులు సవ్యంగా సాగక చికాకు కలిగిస్తాయి. ఉద్యోగులకు పనిభారం, శ్రమ ఎక్కువగా ఉంటుంది. వ్యాపారవృద్ధికి పట్టుదలతో శ్రమపడతారు. ఆదాయం పెరుగుతుంది. ఖర్చులు కూడా ఎక్కువగానే ఉంటాయి. చెల్లింపులు వాయిదా వేసికొంటారు. విద్యార్థులకు విద్య పై శ్రమ తగ్గుతుంది.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

నిర్మాణాలు, క్రొత్త వస్తువుల కొనుగోలులో అదనపు వ్యయముంటుంది. స్థిరాస్తుల కొనుగోలుకు ప్రణాళిక సిద్ధం చేసికొంటారు. ఉద్యోగ వ్యాపారాలలో సమస్యలు, ఒత్తిళ్ళను అధిగమించగలరు. చేపట్టిన పనులు చిన్న చిన్న ఇబ్బందులతో సాగుతాయి. ఆదాయం బాగున్నను, ఖర్చులు మాత్రం అదనంగా ఉంటాయి. స్టాక్‌మార్కెట్ లాభాలు నిరుత్సాహం కలిగిస్తాయి.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

పెద్ద పెట్టుబడుల విషయంలో తొందరపడవద్దు, హామీలు ఇవ్వడం, అప్పులివ్వడం చేయకండి. నిరుద్యోగులకు ఇంటర్వ్యూ అవకాశాలు దొరుకుతాయి. వ్యాపార పరంగా అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. సొంత పనులు జరగడానికి డబ్బు ఖర్చు పెట్టకతప్పదు. బాధ్యతలను సరిగా నిర్వర్తించి అధికారులను సంతృప్తి పరచగలరు. ప్రతి విషయంలో టెన్షన్ ఉంటుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. ఆర్థికముగా ఇబ్బందులుండినా సామాన్య ఆదాయానికి లోపం రాదు. వ్యాపారము, సొంతవృత్తులందు అవకాశాలు సరిగా ఉండవు. ఉద్యోగ పరంగా పనిభారం టెన్షన్ పెరుగుతుంది. మీ మీద గల ఆరోపణలను, విచారణలను ధీటుగా ఎదుర్కొంటారు. ఉద్యోగులు అధికారులతో జాగ్రత్తగా మెలగండి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

శుభకార్యాలందు ప్రముఖ పాత్ర నిర్వహించడం, క్రొత్త పరిచయాలు పెరుగుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు, కోర్టు కేసులు ఒకరకంగా అనుకూలించగలవు. ఉద్యోగులకు పనిభారం, అధికారుల వత్తిడి ఎక్కువ. వ్యాపార వర్గాలకు అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. సొంత పనులందు ఆలస్యం, డబ్బు ఖర్చు పెరుగుతుంది. షేర్లలోను కొద్ది లాభాలుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

బిడ్డల విద్యా, వివాహ విషయాలలో శ్రద్ధ తీసికొంటారు. శుభకార్యాలలో పాల్గొని ప్రముఖ పాత్ర నిర్వహిస్తారు. వృత్తి ఉద్యోగ వ్యవహారాలలో ఇతరుల వత్తిడి ఎక్కువగానున్నను తగిన నిర్ణయాలనే స్థిరచిత్తంతో తీసుకొంటారు. వ్యాపార రంగంలో పెట్టుబడులకు అవకాశాలు, అభివృద్ధి బాగుంటుంది. ఆదాయం పెరుగుతుంది. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి.

## కార్తీక మాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 29 | శుక్ర | ఏకాదశి | ఉ॥గం.10.49వ॥ |
| తేది. 30 | శని | ద్వాదశి | ఉ॥గం.10.17వ॥ |
| తేది. 01 | ఆది | త్రయోదశి | ఉ॥గం.09.19వ॥ |
| తేది. 02 | సోమ | చతుర్దశి | ఉ॥గం.7.56వ॥ |
| | పిదప | అమావ్యాస | పూర్తిగ |

## మార్గశీర్ష మాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 03 | మంగళ | పాడ్యమి | రా॥గం.04.16వ॥ |
| తేది. 04 | బుధ | విదియ | రా॥గం.02.02వ॥ |
| తేది. 05 | గురు | తదియ | రా॥గం.11.43వ॥ |

# హాస్టళ్ల పరిస్థితి ఘోరం

నెల్లూరు జిల్లాలోని హాస్టళ్ల పరిస్థితి ఘోరంగా మారడంతో ఆయా సమస్యలపై టిఎన్‌ఎస్‌ఎఫ్‌ఉద్యమించనుంది. ఈమేరకు సోమవారం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు విలేఖర్లతో మాట్లాడారు. ఈనెల 27 నుంచి టిఎన్‌ఎస్‌ఎఫ్ బృందం జిల్లా వ్యాప్తంగా హాస్టళ్లలోని సమస్యలను పరిశీలిస్తుందన్నారు. బిసి, ఎస్సీ, ఎస్టీలకు చెందిన హాస్టళ్లు 264ఉన్నాయన్నారు. వీటిలో చాలా వరకు బాడుగ ఇళ్లలో ఉన్నాయన్నారు. 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు మెస్‌బిల్లు రూ.252/-లు ఇస్తున్నారన్నారు. ప్రస్తుతం నిత్యావసర ధరలు విపరీతంగా పెరగడంతో మూడు పూటల భోజనం చేసేందుకు మెస్ చార్జీలు ఏవిధంగా సరిపోతాయో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. జిల్లాలోని హాస్టళ్లలో వసతులు, సమస్యలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. ఈసమావేశంలో టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు అమ్ములు, సాయికిషోర్, పాల్గొన్నారు.

# పది లక్షల ఎర్రబంగారం స్వాధీనం

నెల్లూరు జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో అక్రమంగా తరలిపోతున్న ఎర్ర బంగారాన్ని (ఎర్రచందనం) అటవీ అధికారులుగాని పోలీసులు గాని పట్టుకుంటున్నా ఏ మాత్రం జంకకుండా యధేచ్ఛగా అక్రమార్కులు ఎర్రచందనాన్ని తరలిస్తూనేవున్నారు. ఈ కోవలోనే సోమవారం తెల్లవారుజామున మూడు వాహనాల్లో దాదాపు పది లక్షల రూపాయలు విలువగల ఎర్రచందనం దుంగలను నెల్లూరు జిల్లా ఆత్మకూరు అటవీ రేంజ్ అధికారులు సినిమా ఫక్కీలో వేటాడి, వెంటాడి పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు రేంజర్ నాగరాజు కథనం మేరకు నెల్లూరు కడప జిల్లాల సరిహద్దుల్లో స్మగ్లర్ల కదలికలపై సమాచారం రావడంతో బద్వేలు నందవరం మార్గంలో ఒక మినీట్రాక్ వ్యాన్‌ను ఆపేందుకు ప్రయత్నించినా వెళ్ళిపోవడంతో సిబ్బంది వెంబడించారని తెలిపారు.

కంపసముద్రం-కృష్ణాపురం మధ్యలో వాహనాన్ని నిలిపి అందులోని డ్రైవర్ పరారయ్యాడని, మర్రిపాడు-చినమాచనూరు మార్గంలో ఒక క్వాలీస్ వాహనాన్ని అటవీ అధికారులు వెంబడించడంతో చినమాచనూరు దగ్గర క్వాలీసును ఆపి డ్రైవర్ పరారయ్యాడని తెలిపారు. అనంతరం గుండెమడకల మార్గంలో వింజమూరు సమీపంలో అటవీ అధికారులు టాటాహక్స్ వాహనాన్ని ఆపగా అందులోని డ్రైవర్ అటవీ ప్రాంతంలో వాహనాన్ని ఆపి పరారయ్యాడని, మూడు వాహనాల్లో 102 ఎర్రచందనం దుంగలు ఉన్నాయన్నారు. వీటి విలువ దాదాపు 10 లక్షల రూపాయలు ఉంటుందని రేంజర్ తెలిపారు. ఈ దాడుల్లో డిఆర్‌ఓ చిరంజీవి, ఎఫ్‌బీవోలు, లక్ష్మీసాగర్, కె.చిన్నప్ప, ఏబిఓల పి.ఓంప్రకాష్, పిరంజిత్‌కుమార్, పి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version

PDF Compressor Free Version



# కల్యాణ వైభోగం...!



రిచ్ హాస్పిటల్స్ మేనేజర్ పురాణం రాఘవయ్య కుమార్తె **డింపుల్ దీప్తి - రవికిరణ్‌ల** కల్యాణం నవంబర్ 22వ తేదీ నెల్లూరులోని అచ్యుత సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.

## సీట్లు మాకు...

(మొదటిపేజీ తరువాయి)

పెట్టకుంటే ఈ శీతాకాల సమావేశాలలో టీ-బిల్లును ప్రవేశపెట్టలేమని, అప్పుడు రాష్ట్ర విభజన ద్వారా ఆశించిన ప్రయోజనం నెరవేరక పోవచ్చునని కాంగ్రెస్ ఢిల్లీ పెద్దల ఆలోచన. అందుకే రాజ్యాంగ సవరణ అంశాన్ని పక్కనపడేసారు. సీమాంధ్ర కేంద్రమంత్రులు హైదరాబాద్‌ను యూటీ చేయమంటే దానిని పట్టించుకో లేదు. 1956కు ముందు పొజిషన్ ప్రకారం భద్రా చలాన్ని సీమాంధ్రలో కలపాలని కోరితే, దాన్ని మన్నించ లేదు. కాని తెలంగాణ నాయకుల కోరికను మన్నించి తెలంగాణలో వున్న అసెంబ్లీ స్థానాలను 119నుండి 153కు పెంచడానికి మాత్రం జీఓఎం అంగీకరిం చింది. సీమాంధ్ర కేంద్రమంత్రులు ఎంత చేతగాని వారనేది ఇక్కడే తేటతెల్లమవుతుంది. సీమాంధ్ర ప్రయో జనాలను కాపాడే ఏ ఒక్క పనిని కూడా సీమాంధ్ర కేంద్రమంత్రులు సాధించలేక పోయారంటే ఇంతకంటే సిగ్గుచేటు విషయం మరొకటి ఉండదు.

సీమాంధ్ర, తెలంగాణల మధ్య తలెత్తబోయే సమస్య లకు ఈరోజే పరిష్కారం చూపాలి. వాటిని అలాగే వదిలేస్తే భవిష్యత్‌లో కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల మాదిరిగా తన్నుకుచావాల్సి వస్తుంది. కావేరి నీటి వివాదం కర్నాటక - తమిళనాడు మధ్య రగులుతూనే వుంది. కృష్ణాజలాల వివాదాన్ని పరిష్కరించకుండా రాష్ట్ర విభజన చేస్తే రేపు సీమాంధ్ర, తెలంగాణ ప్రాంతాల వారు కొట్టుకుంటుండాలి. రాష్ట్రంలో అటు హైదరాబాద్ నుండి ఇటు చెన్నై వరకు శ్రీశైలం జలాలే తాగునీటి, సాగునీటి కొరతను తీరుస్తున్నాయి. కృష్ణా జలాలపై ఎవరి వాటా ఎంత అనేది తేల్చకుండా రాష్ట్రాన్ని విభజిస్తే, కొత్తగా ఏర్పడే ప్రభుత్వాలు వివా దాలను పెంచుకుంటూపోతాయేగాని పరిష్కరించు కోలేవు. ఎందుకంటే ఇక్కడ రాజకీయపార్టీల డ్రామాలు ఎక్కువైపోతాయి. అలాగే అప్పులు, ఆస్తులకు సంబం ధించి ఇప్పుడే పరిష్కారం చూపాలి. వీటన్నింటిని పరిష్కరించాలంటే కేంద్రప్రభుత్వానికి సమయం చాలదు. చాలినా పరిష్కరించాలనే చిత్తశుద్ధి వారిలో కనిపించడం లేదు. చేతిలో అధికారం వుంది కాబట్టి అడ్డగోలు విభజన చేసి పడేస్తాం... మాకు సీట్లు ముఖ్యం అన్న కోణంలోనే కేంద్రం మొండిగా పోతుంది.

## ఏ పనీ లేకే...

(మొదటిపేజీ తరువాయి)

దేశంలో సమస్యలేవీ లేనట్లు, ప్రధాని, కేంద్రమంత్రులకు చేయడానికి వేరే పనులేమీ లేనట్లు, ఇప్పటికిప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయకపోతే సునామీ, భూకంపాలు వచ్చి దేశం మునిగిపోయేటట్లు రాష్ట్ర విభజన ప్రకటన చేసారు. తెలంగాణ ఏర్పాటు ప్రకటన చేయడం ద్వారా వీళ్ళకు వీళ్ళు ఒక కొత్త పనిని సృష్టించు కున్నట్లయ్యింది. ఇప్పుడు కేంద్రంలో సోనియాగాంధీ నుండి ప్రధాని మొదలుకొని కేంద్రమంత్రులందరికీ మన రాష్ట్ర విభజన పెద్ద పనయ్యింది. కేంద్రంలో ఎలాగూ పరిపాలన నడవడం లేదు. దేశంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే సత్తా కూడా కేంద్ర పాల కులలో లేదు. సోనియాగాంధీ చక్రం తిప్పగలదు. కాని ఆమె తిప్పుతున్న చక్రం ప్రజలకు మంచికంటే చెడుకే ఎక్కువగా ఉపయోగపడుతుంది. ప్రధాని మన్మోహన్‌సింగ్ చూస్తే ఇక్కడుంటే లేనిపోని తలనొప్పు లెందుకని ఎక్కువగా విదేశీ పర్యటనలు పెట్టుకుంటు న్నాడు. ఇక కేంద్రమంత్రులు చూస్తే ఒక్క ఆంటోనిలో తప్పితే ఇంకెవరిలోనూ సమస్యలపై స్పందించే గుణం లేదు. సోనియాగాంధీ చెప్పింది కాబట్టి మన రాష్ట్రాన్ని అడ్డంగా నరకాలనే ధోరణిలో ఉన్నారు. కేంద్రంలో దాదాపు 10మంది కేంద్రమంత్రులు ఇంకే పనీపాటా లేకుండా మన రాష్ట్ర విభజన అంశాన్నే పెద్ద పనిగా పెట్టుకుని మల్లగుల్లాలు పడుతున్నారు.

ఇక్కడ కేంద్ర ప్రభుత్వం ఒక్కటే చెడిపోలేదు. కేంద్రం చేసిన పాడుపనితో రాష్ట్ర ప్రభుత్వం కూడా చెడిపోయింది. రాష్ట్ర విభజన ప్రకటన రాకముందు ప్రభుత్వం అంతో ఇంతో పనిచేస్తుండేది. ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటు న్నారు. ప్రభుత్వ పరంగా పథకాలు, పనులు సవ్యంగానే జరుగుతుండినాయి. విభజన ప్రకటన తర్వాత వీళ్ళు కూడా చేస్తున్న పనులను పక్కనపడేసారు. రాష్ట్రాన్ని సమైక్యంగా ఉంచాలని కొందరు, లేదు తెలంగాణ ఇవ్వాలని మరికొందరు ఇలా చేస్తున్న పనులు మానుకుని ఈ పనుల్లో పడ్డారు. అంటే ఇక్కడ కూసే గాడిద వచ్చి మేసే గాడిదను చెడగొట్టిందన్న సామెత గుర్తుకు వస్తుంది. కేంద్రం పనికిమాలిన పనికి రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయింది.

కేంద్ర పాలకులు సమర్థులైతే దేశంలో పరిష్కరించ దానికి ఎన్నో సమస్యలున్నాయి. సరిహద్దుల్లో చొరబాట్లు దేశ భద్రతకే సవాల్‌గా నిలుస్తున్నాయి. అంతర్గతంగా తీవ్రవాద దాడులు, పెరుగుతున్న ధరలు, పడిపోతున్న రూపాయి, తరిగిపోతున్న వృద్ధి రేటు, పేరుకుపోతున్న నిరుద్యోగం... ఇలా చెప్పలేనన్ని సమస్యలు ఉన్నాయి. వీటన్నింటికి పరిష్కారం చూపలేని ప్రభుత్వం తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి, ఆ సమస్యలపై నుండి ప్రజల దృష్టిని మళ్ళించడానికే పనికిమాలిన విభజన కార్యక్రమాన్ని పెట్టుకున్నట్లుగా ఉంది.

## ఆ రెండు మినహా...

(2వ పేజీ తరువాయి)

రంగంలో ఉండే అవకాశాలున్నాయి. రిజర్వుడ్ నియోజకవర్గాలైన సూళ్ళూరుపేట, గూడూరులకు ఒకరికి మించి ఇద్దరు, ముగ్గురిని సమన్వయ కర్తలుగా నియమించడంతో అభ్యర్థుల విషయమై క్లారిటీ రాలేదు. అయితే సూళ్ళూరుపేటలో మాజీఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నందున మరో సమన్వయకర్త కె.సంజీవయ్య ఇక్కడ ముందంజలో వున్నట్లు తెలుస్తుంది. గూడూరులో మాత్రం సమన్వయకర్తలుగా వున్న పాశం సునీల్‌కుమార్, సిహెచ్ బాలచెన్నయ్యలు నువ్వా-నేనా అన్నట్లు పనిలో పోటీ పడుతున్నారు. గూడూరు అభ్యర్థి ఎంపికపై కొంత కాలం సస్పెన్స్ తప్పదు!

నూతన భవనంలో, అత్యాధునిక పరికరాలతో...

# మోడరన్ స్కిన్ & కాస్మొటాలజీ క్లినిక్



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి

నెల్లూరులో మంచి పేరు ప్రఖ్యాతులు పొందిన చర్మవ్యాధులు, శిరోజాల వైద్య నిపుణులు డాక్టర్ పర్వతరెడ్డి పెంచలరెడ్డి నెల్లూరు పొగతోటలో ఈ నెల 28న కొత్తగా కట్టిన భవనంలో అత్యాధునిక పరికరాలతో, నూతన వసతులతో కూడిన మోడరన్ స్కిన్ & కాస్మొటాలజీ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ వేడుకలో నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి, నెల్లూరు నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, ప్రొఫెసర్ జి.రఘురామారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ పర్వతరెడ్డి పెంచలరెడ్డి మాట్లాడుతూ ఈ క్లినిక్‌లో అత్యంత నాణ్యమైన సాంకేతికతో కూడిన అధునాతన సేవలను నెల్లూరు ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. అవాంఛిత రోమాలను తొలగించుటకు డయోడ్ లేజర్, బొల్లి మరియు సొరియాసిస్ వ్యాధులను నయంచేయుటకు ఫోటోథెరపీ, పులిపిర్లు తొలగించుటకు కాన్‌మెడ్ హైఫ్రికేటర్, ముఖం మీద మచ్చలను మొటిమలను తొలగించుటకు కెమికల్ పీలింగ్, ఆక్నేస్కార్స్ తగ్గించుటకు మైక్రోడెర్మాబ్రాషియన్, హెయిర్ అనాలసిస్ ద్వారా నాన్ హెయిర్ ఫాల్ ట్రీట్‌మెంట్‌లు అందిస్తామన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలే!

**- జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్**

మద్యం వ్యాపారులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని నెల్లూరుజిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డా॥కె.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ నిబంధనలు పాటించని వారిపై ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 91కేసులు నమోదు చేసామన్నారు. మద్యం వ్యాపారుల నుంచి దాదాపు 26.40లక్షలు జరిమానా వసూలు చేసామన్నారు. జిల్లాలో ఈ ఏడాది 181మద్యం దుకాణాలకు లైసెన్స్ ఫీజు 73.17కోట్లు, 43బార్లుకు లైసెన్సు రెన్యూవల్ ఫీజు 16.13కోట్లు ప్రభుత్వ ఖజానాలో జమచేసామన్నారు. గతఏడాది ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 446.41కోట్లు మద్యం విక్రయాలు జరగగా, ఈ ఏడాది అక్టోబర్ వరకు 501.12కోట్ల మద్యం విక్రయాలు జరిగాయన్నారు. నెల్లూరు ఎక్సైజ్ జిల్లా పరిధిలో అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలకు సంబంధించి 1193కేసులు నమోదుచేసి 615మందిని అరెస్టు చేసామన్నారు. కావలి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 865లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కప్పరాళ్ల తిప్ప, ఉమామహేశ్వరపురంలో నాటుసారా తయారీకేంద్రాలపై దాడులుచేసి 36వేల 690లీటర్ల బెల్లం ఊటను స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం వ్యాపారులు నిర్ణీత ధరలకే మద్యం విక్రయించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. లేదంటే కేసులు నమోదు చేస్తామన్నారు.

# విసిఇఎస్‌పై అవగాహన సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న సూపరింటెండెంట్ ప్రసాద్, పక్కన దేవరాజన్, సుబ్బారావు, రామకృష్ణ

ఈ నెల 28వ తేదీన కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ నెల్లూరు డివిజన్ ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ డి.ఆర్.ఉత్తమ్‌లో 'వాలెంటరీ కంప్లియన్స్ ఎంకరేజ్‌మెంట్ స్కీం-2013'పై పరిచయ కార్యక్రమం జరిగింది. కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ ఎం.దేవరాజన్ ఈ సమావేశంలో పాల్గొని ఈ స్కీంపై అవగాహన కలిగేలా వివరించారు. ఈ స్కీంలో వున్న సందేహాలను నివృత్తి చేసారు. వాణిజ్య వ్యాపార సంఘాలకు చెందిన సభ్యులు, ఆడిటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## 1న భక్తి గానలహరి

గాత్రసంగీతంలో ఎంతోమంది చిన్నారులకు శిక్షణనిచ్చి వారిని సంగీతసౌరభాలుగా తీర్చిదిద్దిన భారతి సంగీత విద్యాలయం వ్యవస్థాపకులు ఎ.రమాదేవి పర్య వేక్షణలో డిసెంబర్ నెల 1వ తేదీ సాయంత్రం 6.05 గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో రామదాసు సంకీర్తనల భక్తిగానలహరి కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నారు. ఈ గానలహరిలో రమాదేవి శిష్యురాండ్రు కె.లావణ్య, ఎ.హరికృష్ణ, ఎస్.హంసిని, ఎ.యతీష్, కె.శ్వేతప్రియ, యం.ఆశ్రితసాయి, యం.హర్షిత సాయి, మోక్షారెడ్డి వీనులవిందుగా గానం చేస్తారు.



ఈ నెల 25వ తేదీన నెల్లూరు కల్యాణ్ ఫిలిమ్స్ నందు అఖిలభారత హేండ్‌లూమ్ బోర్డు డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా మాజీ జడ్పీఛైర్మెన్ చెంచలబాబుయాదవ్‌ను సన్మానిస్తున్న నెల్లూరుజిల్లా నేనేత కార్మిక ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు దోనేపూడి కోటేశ్వరరావు మరియు కమిటీసభ్యులు.

PDF Compressor Free Version



## రుద్రమదేవికి భారీసెట్

గుణశేఖర్ అంటేనే భారీసెట్‌లకు పెట్టింది పేరు. అలాంటి గుణశేఖర్ 'రుద్రమదేవి' సినిమాను డైరెక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే! ఈ చిత్రానికి కూడా కొన్ని భారీసెట్స్ వేసారు. ఆదిలాబాద్ జిల్లాలోని కుంతల వాటర్‌ఫాల్స్ దగ్గర ఓ దేవాలయ సెట్‌ని నిర్మిస్తున్నారు. ఈ సెట్ వరంగల్‌లోని 1000 స్థంభాల గుడిని ప్రతిబింబించేలా ఉంటుందని అంటున్నారు. అనుష్క రుద్రమదేవి పాత్ర పోషిస్తున్న ఈ సినిమాలో రానా ఓ కీలకపాత్రలో కనిపించ నున్నాడు. కృష్ణంరాజు, నిత్యామీనన్, కేథరిన్, బాబా సెహగల్ ప్రధానపాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమా 2014లో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలున్నాయి.






## ఒక్క ఛాన్స్..


తెలుగుతెర ప్రిన్స్ మహేష్ సరసన నటించాలని ఏ హీరోయిన్ అయినా కోరుకుంటుంది. ఈ వరుసలోనే తాప్సి చేరిపోయింది. మహేష్ తాజాగా నటించనున్న 'ఆగడు' చిత్రానికి హీరోయిన్‌గా తమన్నా నటిస్తుండగా రెండోహీరోయిన్ వుందని తెలుసుకున్న తాప్సి, ఆ పాత్రలో తను నటించాలని ఉబలాట పడుతుంది. ఈ క్రమంలో చిత్ర దర్శకుడు శ్రీను వైట్లను కలిసేందుకు తాప్సి ప్రయత్నాలు సాగిస్తుంది.

## మూ'వీ'క్షణం



## మాస్‌లుక్ అదుర్స్

ఫ్యామిలీ హీరోగా, క్లాస్ హీరోగా ఇప్పటి వరకు కనిపించిన నాని, 'జెండాపై కపిరాజు' చిత్రంలో ఓ మాస్‌రోల్‌ను పోషించనున్నాడు. డ్యూయల్ రోల్ పోషిస్తున్న నాని, ఓ రోల్‌లో మాస్‌గా నటిస్తున్నాడు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను నాని ఇటీవల రిలీజ్ చేయగా మాస్ రోల్‌లో నాని సూపర్ అని సోషల్ నెట్వర్క్స్‌లో మంచి రెస్పాన్స్ వచ్చిందట!



## పోటీకి సిద్ధం

తనకు తానే పోటీ అనే సిద్ధాంతాన్ని నమ్మే పవన్ ఇతర స్టార్స్‌కు పోటీని ఇనన్తానే వుంటాడు. ఇప్పటి వరకు వెండితెరపైనే కనిపించిన పవన్ బుల్లితెర అడ్వర్టైజ్‌మెంట్లకు, కంపెనీల అంబాసిడర్‌గా నటించ లేదు. ఇప్పుడు పవన్ పెప్సీ కంపెనీ యాడ్‌లో నటించబోతున్నట్లు తెలుస్తుంది. దీంతో యాడ్స్‌లో ఎదురు లేకుండా దూసుకుపోతున్న మహేష్‌కు పవన్ పోటీకి వస్తున్నట్లే!

## బాహుబలికి వినూత్న టెక్నిక్స్

చిత్రనిర్మాణంలో వినూత్నమైన టెక్నిక్స్‌ని ఉపయోగించడంలో తెలుగు చిత్ర పరిశ్రమలో రాజమౌళి ముందుంటాడు. ఇప్పటికే ఈ విషయాన్ని 'ఈగ' చిత్రంతో నిరూపించాడు. ఇప్పుడు ఆయన ఎంతో ప్రతిష్టాత్మకంగా తీస్తున్న చిత్రం 'బాహుబలి'. ఈ చిత్రం కోసం చాలాసెట్స్‌ని, వస్తువులని ఉపయోగిస్తున్నారు. వీటన్నిటినీ రీచ్‌కావడం కోసం ఈ చిత్ర యూనిట్ సరికొత్త విధానాల్ని ఫాలో అవుతుంది. వస్తువుల తయారి కోసం ఏకంగా రామోజీ ఫిలింసిటీలో ఓ పెద్ద ఖాళీ ప్రదేశాన్ని తీసుకున్నారు. రిమోట్‌తో కంట్రోల్ చేయగలిగిన కొన్ని జంతువులని కూడా క్రియేట్ చేస్తున్నట్లు సమాచారం. 2015లో ఈ చిత్రం విడుదలవుతుంది.



# గూడూరు డివిజన్ వార్తలు

### లోక్‌అదాలత్‌లో...

## చకచకా పరిష్కారమైన కేసులు



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జీలు

గూడూరు పట్టణంలోని కోర్టు అవరణలో 23వ తేదీ జరిగిన మెగా లోక్‌అదాలత్‌లో 593కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా ఏడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి.గురప్ప మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో ఇరువర్గాల రాజీ ద్వారా కేసులు పరిష్కరిస్తామన్నారు. 593కేసులు పరిష్కరించగా వాటిలో 312 క్రిమినల్ కేసులు, 281 సివిల్‌కేసులు ఉన్నాయన్నారు. అలాగే బ్యాంక్ బకాయిలు రూ.8,23,000లు రికవరీ అయినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి పి.రాజారాం, అదనపు ప్రథమశ్రేణి న్యాయమూర్తి సి.మురళీధర్, తహశీల్దార్ మైత్రేయ, సీనియర్ ఏపీపీ నాగేశ్వరరావు, బ్యాంక్ మేనేజర్, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు రైల్వేస్టేషన్లో... కోరిన రుచులు

నెల్లూరుజిల్లా గూడూరు రైల్వేస్టేషన్లో కోరిన రుచులు 24గంటలూ అందుబాటులో ఉంటాయి. రైళ్ళల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయన్న కారణంతో ప్యాంట్రీకార్‌లను రద్దుచేయాలనే దిశగా రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

దీనికి ప్రత్యమ్నాయంగా ప్రధాన రైల్వేస్టేషన్లో ప్రయాణీకుల సౌకర్యార్థం 24 గంటలూ అందుబాటులో ఉండే ప్రత్యేక ఫుడ్‌ప్లాజాలను ఏర్పాటుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సౌకర్యాన్ని గూడూరు రైల్వే ప్రయాణీకులు కూడా వాడుకోనున్నారు. ఈ స్టేషన్లో ఫుడ్‌ప్లాజా ఏర్పాటుచేయాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఇక్కడ ప్లాజా పనులు వేగం పుంజుకున్నాయి. త్వరలో ప్లాజాను ప్రారంభించనున్నారు.

## రచ్చబండకు రేషన్‌కార్డులు రెడీ

### తహశీల్దార్ మైత్రేయ

రచ్చబండలో రేషన్‌కార్డుల కోసం 4వేల మంది గతంలో దరఖాస్తులు చేసుకున్నారని గూడూరు మండల తహశీల్దార్ మైత్రేయ వెల్లడించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో 500మంది కుటుంబసభ్యుల ఫోటోలు ఇవ్వనందువల్ల సిద్ధంకాలేదన్నారు. మిగిలిన 3వేల500మంది కార్డులు రచ్చబండలో ఇవ్వనున్నట్లు తెలిపారు.

## పట్టణ సిఐగా రవికుమార్



గూడూరు పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టిన కె.రవికుమార్

గూడూరు టౌన్ సిఐగా కె.రవికుమార్ 23వ తేదీన బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇసుకపల్లి మెరైన్ పోలీసుస్టేషన్‌లో పనిచేశారు. గూడూరు సర్కిల్‌లో పనిచేస్తున్న సత్యనారాయణను రేంజ్ వి.ఆర్.కు బదలీ చేశారు. విధులు చేపట్టిన అనంతరం సిఐ రవికుమార్ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రిళ్ళు చోరీలు జరగకుండా గస్తీ పెంచుతామన్నారు.

## భయ పెడుతున్న ట్రాఫిక్

### ట్రాఫిక్ పెరిగిపోతోంది... పట్టించుకునేవారేరి?

గూడూరు పట్టణంలో రోజురోజుకీ ట్రాఫిక్ పెరిగిపోతోంది. పరిమితికి మించి ఆటోలు పెరిగిపోతున్నాయి. అయితే ఆటోవాలాలు ట్రాఫిక్ నిబంధనలు పట్టించుకోవడం లేదు. ఆటోవాలాలు ఎటుపడితే అటు వెళుతున్నారు.

పట్టణంలో సుమారు 2500కుపైగా ఆటోలున్నాయి. ఇక ఇతర గ్రామాల నుంచి వచ్చే ఆటోలు సుమారు 500 పైగా ఉంటాయి. పట్టణంలోని ఇరుకు రోడ్లపై ఆటోలు ఇష్టానుసారంగా వెళుతున్నాయి. ఫలితంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణీకులు కనిపిస్తే చాలు నిలిపివేస్తారు. వెనుక ఉన్న వాహనాలు గురించి పట్టించుకోరు. అడిగితే గొడవకు దిగుతారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన పట్టణ సిఐ కె.రవికుమార్ పట్టణంలో ఆటోవాలాల ఆగడాలను ఎలా పరిష్కరిస్తారో వేచిచూడాలి.

## ఆలయనిర్మాణ పనులకు శంఖుస్థాపన



శ్రీ కైలాసనాథస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

గూడూరు మండల పరిధిలోని తిప్పవరప్పాడు గ్రామంలో వైయస్సార్సీపీ మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి, మెట్టు రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా కోటి రూపాయల వ్యయంతో నిర్మించ తలపెట్టిన శ్రీ కైలాసనాథస్వామి ఆలయ నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేసారు. గ్రామంలో పురాతనంగా ఉన్న శివలింగాన్ని ఈ ఆలయంలో ప్రతిష్టించనున్నట్లు మల్లు విజయకుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో అన్ని హంగులతో అధునాతనంగా ఈ ఆలయాన్ని నిర్మించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూడూరు రాజేశ్వరరెడ్డి, జక్కంరెడ్డి రమణారెడ్డి, దుద్దా కృష్ణారెడ్డి, దేగపూడి కృష్ణారెడ్డి, వేమూరు విజయమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులను ఆదుకోండి



బాధితులను పరామర్శిస్తున్న అరవ పార్వతయ్య, యేకుల రవిచంద్ర

అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు అరవ పార్వతయ్య కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు మండల పరిధిలోని పోటుపాళెం గ్రామపరిధిలో నివసిస్తున్న 6కుటుంబాల గిరిజనుల ఇళ్ళు అగ్నికి ఆహుతై ఆ కుటుంబాలన్నీ నిలువ నీడ లేక రోడ్డుమీదనే ఉన్నాయన్నారు.

గిరిజనాభివృద్ధి సంస్థ ద్వారా బాధితులను ఆదుకునేందుకు కృషి చేస్తానని, అలాగే అరవ వెంకటమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తామన్నారు. ఆయన వెంట మాల మహానాడు నాయకులు దాసరి కృష్ణ, యేకుల రవిచంద్ర పాల్గొన్నారు.

### అమ్మవారి ఆలయాల్లో

## ప్రత్యేకపూజలు

గూడూరు పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో కార్తీకమాసం ప్రత్యేకపూజలు 22వ తేదీ జరిగాయి. రెండోపట్టణంలోని మాళవ్యానగర్ వద్దనున్న మహాలక్ష్మిదేవి, సొసైటీ ప్రాంతంలో ఉన్న నారాయణమ్మ హైస్కూల్ రోడ్డులో ఉన్న రాజరాజేశ్వరీదేవి, శివాలయం, కన్యకాపరమేశ్వరీదేవి, రాజావీధిలో వెలసిన గంగమ్మ, కుమ్మరవీధిలోని చెంగాళమ్మ అమ్మవారి ఆలయాల్లో భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. రాహుకాల, కుంకుమపూజలు చేసారు.

PDF Compressor Free Version



# సోనియా బానిసలుగా సీమాంధ్ర కేంద్రమంత్రులు

సీమాంధ్ర కేంద్రమంత్రులు సోనియా గాంధీకి బానిసలని, వారింట్లో ఊడిగం చేయడానికే పుట్టారని ఏ.పి ఎన్జీఓ అధ్యక్షుడు సమైక్య రాష్ట్ర పరిరక్షణ వేదిక ఛైర్మెన్ పి.అశోక్‌బాబు విమర్శించారు. ఏ.పి ఎన్జీఓ నెల్లూరుజిల్లా అధ్యక్షుడు సి.హెచ్. రవీంద్రబాబు కుమార్తె వివాహవేడుకలలో పాల్గొనేందుకు 27వ తేదీ ఆయన నెల్లూ రొచ్చారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, విద్యార్థులు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మన సీమాంధ్ర కేంద్రమంత్రులను భావితరాలు క్షమించవన్నారు. పదవుల కోసం ప్రజల మనోభావాలను తాకట్టుపెట్టారు. మన రాష్ట్రానికి పట్టిన శనిలా ఈ కేంద్ర మంత్రులు దాపురించారు. మన సీమాంధ్ర




ఉద్యోగుల సభలో ప్రసంగిస్తున్న అశోక్‌బాబు

కేంద్రమంత్రులు, ఎంపీల చేతకాని తనం వల్లే విభజన ప్రక్రియ కొంతవరకు ముం దుకు సాగింది. సోనియాగాంధీ తన కొడుకును ప్రధానిని చేయడం కోసం మన బిడ్డల భవిష్యత్‌ను కాలరాస్తుందని ఆయన ధ్వజమెత్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్ర విభజన జరగదు. రాజ్యాంగపరంగా రాష్ట్ర విభజన జరగాలంటే 11అంశాలు పరిష్కరించాలి. వీటిలో ఏ ఒక్కటీ కేంద్రం పరిష్కరించడం లేదు. రాజ్యాంగ నిబంధ నలను ఉల్లంఘించి రాష్ట్ర విభజనకు పూనుకుంటే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం. రాష్ట్రపతిని కూడా కలిసి ఈ అన్యాయపు విభజనను అడ్డుకోమని కోరుతామన్నారు. విభజన ప్రక్రియ ఆపకపోతే మళ్ళీ సమ్మెకు దిగుతామని ఆయన హెచ్చరించారు. ఈసారి సమ్మెకు దిగితే పరిస్థితులు చాలా తీవ్రంగా ఉంటాయన్నారు. ఆర్టికల్ 371డిని సవరించకుండా రాష్ట్ర విభజన జరగదని ఆయన ఘంటాపథంగా చెప్పారు.

ఈ సమావేశంలో ఏపి ఎన్‌జిఓ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, విద్యుత్ ఉద్యో గుల జేఏసీ ఛైర్మెన్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## కరెన్సీనోట్లపై రాతలు 'చెల్లవ్'



కరెన్సీ నోట్లపై ఎలాంటి రాతలు ఉన్నా చెల్లవని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచారం. 2014 జనవరి నెల నుంచి ఈ విధానం అమలు చేయబోతున్నట్లు ఆర్బీఐ అన్ని జాతీయ బ్యాంకులకు ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచారం. ప్రస్తుతం పందనోట్లును లెక్కపెట్టి పైనోటు మీద 100అంకె రాయడం, జేబులో ఖాళీ పేపర్ లేకపోతే అర్జంటుగా ఫోన్ వస్తే ఆ నెంబర్లు రాసుకోవడం, ఇంకా ఏమీ తోచ నప్పుడు పేర్లు వ్రాసుకోవడం, బొమ్మలు గీయడం, ప్రేమసందేశాలు రాయడం వంటివి చేస్తే ఆ నోట్లు బ్యాంకుల్లో తీసుకోరు. ఎక్కడా చెల్లవు. పదిలంగా పటంకట్టి చూసుకోవా ల్సిందే! అలాగే కొన్ని పండగలప్పుడు రంగులు అంటుకోవడం, నూనె మరకలు, గ్రీజు, ఆయిలు మరకలు పడితే అవి పోవడానికి కరెన్సీ నోట్లను ఉతకడం లాంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లవు. అలవాటులో పొరపాటుగా 500, 1000నోట్లపై రాస్తే మాత్రం మటాష్! ఇలాంటి అలవాట్లను జాగ్రత్తగా కట్టిపెట్టి ఈ ఏడాది డిసెంబర్ నెల 31వ తేదీలోగా రాతలు ఉండే నోట్లను మార్చుకోవడం మంచిదేమో... సో... బీ అలెర్ట్.

## కమలమే కీలకం!

సీమాంధ్ర సమస్యలను పరిష్కరించనిదే విభజనపై ముందుకు పోవద్దని బీజేపీ పదేపదే హెచ్చరిస్తూ వచ్చింది. తెలంగాణ బిల్లు ఆమోదం పొందాలంటే కాంగ్రెస్ ఎంత అవసరమో బీజేపీ మద్దతు కూడా అంతే అవసరం. బీజేపీ మద్దతు లేనిదే పార్లమెంటులో తెలంగాణ బిల్లు గట్టెక్కే పరిస్థితి లేదు. కాంగ్రెస్ కంటే ముందు నుండి కూడా బీజేపీయే తెలంగాణకు అనుకూలంగా ఉంది.

అయితే ఇంత దిక్కుమాలినతనంగా చేస్తున్న రాష్ట్ర విభజనకు బీజేపీ మద్దతు పలుకుతుందా? అలా చేస్తే కాంగ్రెస్‌కు బీజేపీకి తేడా ఏముంది. ఎటువంటి వివాదాలు లేకుండా ఎన్డీఏ ప్రభుత్వహయాంలో మూడురాష్ట్రాలను ఏర్పాటు చేసామని బీజేపీ నాయకులు చెబుతున్నారు. వాళ్ల ఏర్పాటు చేసిన రాష్ట్రాల పరిస్థితి వేరు, ఆంధ్రప్రదేశ్ పరిస్థితి వేరు. ఇక్కడ ప్రతిదీ వివాదంగానే ఉంది. ప్రతి సమస్య జటిలంగానే ఉంది. ఏకపక్ష విభజనతో కాంగ్రెస్ ముద్దాయిలా తయారైంది. ఏకపక్ష విభజనకు మద్దతు పలికి కాంగ్రెస్ పక్కన బీజేపీ కూడా ముద్దాయిగానే నిలుస్తుందా? ఈ అవసరం బీజేపీకి ఉందా? కాంగ్రెస్‌లాగే బీజేపీ కూడా ఏకపక్ష విభజనకు మద్దతు పలికితే ప్రజలు రెండుపార్టీలను ఒకే గాటిన కట్టేయడం ఖాయం.

రాష్ట్ర విభజనపై కేంద్రం ఏకపక్షంగా పోతుంది. సీమాంధ్రుల సమస్యలను పట్టించుకోకుండా, పరిష్కరించకుండానే కేంద్రం పార్లమెంటులో తెలంగాణబిల్లు పెట్టడానికి సిద్ధపడుతుంది. ఇలాంటి బిల్లు బీజేపీకి ఆమోదయోగ్యమేనా? రాష్ట్రాల ఏర్పాటులో సంప్రదాయాలను కాలరాయడానికి వారు సమ్మతమేనా? అధికారపక్షం తప్పుచేస్తున్నప్పుడు దానిని అదిలించి సక్రమమార్గంలో నడిపించాల్సిన బాధ్యత ప్రధానప్రతిపక్షంపై ఉంటుంది. ఈరోజు ఏకపక్ష బిల్లుకు అధికార, ప్రధానప్రతిపక్షాలు రెండూ మద్దతు పలికితే... ప్రజాస్వామ్యం బ్రతికి బట్టకట్టే పరిస్థితి ఉండదు. చేతిలో అధికారం ఉంటే దేశాన్నయినా అమ్ముకోవచ్చుననే సందేశం పోతుంది. ఈ ఏకపక్ష బిల్లుకు మద్దతు పలికితే చెడ్డపేరు తప్ప బీజేపీకి వచ్చే రాజకీయ ప్రయోజనం ఏమీ ఉండదు. ఇంత అన్యాయంగా రాష్ట్రాన్ని చీల్చడం ద్వారా ఏర్పడే తెలంగాణలో బీజేపీకి ఓట్లు పెరగొచ్చేమోగాని సీట్లు పెరగవు. తెలంగాణలో కాంగ్రెస్‌కు నాలుగు సీట్లు ఎక్కువ వచ్చినా దానికి కారణం బీజేపీయే అవుతుంది. దీనికంటే కూడా ఈ అన్యాయపు విభజనను అడ్డుకోవడం ద్వారా బీజేపీ సీమాంధ్రులకు న్యాయం చేసిన పార్టీ అవుతుంది. తెలంగాణబిల్లు ఆగిపోతే కాంగ్రెస్ రెండుచోట్లా చెడిపోతుంది. బీజేపీకి తెలంగాణలో వచ్చే చెడ్డపేరేమీ ఉండదు. మేం అధికారంలోకి వచ్చాక వివాదాలు లేకుండా తెలంగాణ ఇస్తామని చెప్పుకోవచ్చు. అదే సమయంలో ఆ పార్టీ సీమాంధ్రులకూ దగ్గరయ్యే అవకాశముంది.




జననం: 26.11.1947
మరణం: 1.12.1995
18వ వర్ధంతి

శ్రద్ధాంజలి



స్నేహానికి అమృతమూర్తి.. సేవా గుణానికి ప్రజాబంధువు...
దాతృత్వానికి మారుపేరు.. మంచితనానికి ప్రతిరూపం...

కీ॥శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు

ఒంగోలు పార్లమెంటు మాజీసభ్యులు

18వ వర్ధంతి సందర్భంగా వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ..

కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు

తేది: 1-12-2013, ఆదివారం ఉదయం 11గం॥లకు
నెల్లూరు, రంగనాయకులపేటలోని శ్రీరాఘవ కళ్యాణమండపమునందు అన్నదాన కార్యక్రమము జరుగును.


Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.